సోమవారం
29-08-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 69
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

స్థాపితం 1952 విశాలాంధ్ర 70

బీజేపీకి సహకరించే ఎవరితోనైనా
యుద్ధమే

- సమస్య ఉన్నచోట కమ్యూనిస్టులు తెల్లకొంగల్లా వాలాలి
- సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసే మోదీ ప్రభుత్వంపై నిరంతర పోరు
- సీపీఐ రాష్ట్ర మహాసభల్లో నారాయణ

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: బీజేపీకి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించే ఏ శక్తులతోనైనా రాబోయే రోజుల్లో యుద్ధమేనని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ స్పష్టం చేశారు. విశాఖలో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర 27వ మహాసభల్లో ఆదివారం ప్రతినిధులనుద్దేశించి ఆయన ప్రసంగించారు. ఇందుకోసం ప్రజా ఐక్య ఉద్యమాలను బలోపేతం చేయాల్సి ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని, సమాఖ్య స్ఫూర్తిని మోదీ ప్రభుత్వం దెబ్బతీస్తున్నదని, దీనిపై బీజేపీయేతర శక్తులతో కలిసి ఉద్యమించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ విషయమై స్థానికంగా ప్రాంతీయ పార్టీలతో కొన్ని ఇబ్బందులున్నప్పటికీ అంతిమంగా బీజేపీని కేంద్రంలో గద్దె దించడమే లక్ష్యం

- మిగతా 2 లో

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సహాయ కార్యదర్శులుగా ముప్పాళ్ల, జేవీఎస్ఎన్

సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా కె. రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఈ పదవికి ఎన్నిక కావడం ఇది వరుసగా మూడవ సారి. సహాయ కార్యదర్శులుగా ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణమూర్తి తిరిగి ఎన్నికయ్యారు. ఈ నెల 26 నుంచి మూడు రోజులపాటు ఇక్కడ జరిగిన సీపీఐ రాష్ట్ర 27వ మహాసభలలో ఆదివారం మూడో రోజు నూతన నాయకత్వం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన రాష్ట్ర సమితి, కార్యవర్గం వివరాలను సోమవారం ప్రకటిస్తారు.

విశాలాంధ్రబ్యూరో-విశాఖపట్నం

ముప్పాళ్ల నాగేశ్వరరావు

జేవీఎస్ఎన్మూర్తి

రామకృష్ణ

క్షణాల్లో కూలిన సౌధాలు

- 100 మీటర్ల ఎత్తయిన సూపర్‌టెక్ జంట సౌధాలు కూల్చివేత
- 'వాటర్‌ఫాల్ ఇంప్లోజన్' సాంకేతికతతో...
- 3,700 కిలోల పేలుడు పదార్థాల వినియోగం

నోయిడా : నోయిడాలో 100 మీటర్ల ఎత్తయిన సూపర్‌టెక్ జంట సౌధాలను ఆదివారం కూల్చివేశారు. కేవలం 10 సెకన్ల వ్యవధిలోనే ఈ జంట సౌధాలు పేకమేడల్లా కుప్పకూలిపోయాయి. దాదాపు 100-మీటర్ల ఎత్తయిన ఈ జంట సౌధాలు ఢిల్లీలోని ఐకానిక్ కుతుబ్ మినార్ (73 మీటర్లు) కంటే ఎత్తయినవి. ఆధునిక ఇంజనీరింగ్ ఉత్కంఠభరితమైన దృశ్యంలో 'వాటర్‌ఫాల్ ఇంప్లోజన్' సాంకేతికత ద్వారా కార్డుల ఇల్లులాగా ఉండే ఈ సౌధాలను సెకన్లలో నేలపైకి తీసుకువచ్చారు. భారతదేశంలో కూల్చివేసిన అత్యంత ఎత్తయిన నిర్మాణాలు ఇవి కావడం విశేషం. కూల్చివేసిన నిమిషాల తర్వాత, సమీపంలోని భవనాలు సురక్షితంగా కనిపించాయి. అయితే దీనిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అపెక్స్ (32 అంతస్తులు), సెయానే (29 అంతస్తులు) అనే ఈ జంట సౌధాలు 2009 నుంచి దేశ రాజధాని ఢిల్లీకి ఆనుకుని ఉన్న నోయిడాలోని సెక్టార్ 93ఏ లోని సూపర్‌టెక్ ఎమరాల్డ్ కోర్ట్ హౌసింగ్ సొసైటీలో నిర్మాణంలో ఉన్నాయి. టవర్లు 40 అంతస్తులతో 21 దుకాణాలు, 915 నివాస అపార్ట్‌మెంట్‌లతో నగరం మనోహరమైన వీక్షణను కలిగి ఉండేలా నిర్మాణం చేశారు. కాగా భవనాన్ని కూల్చివేసేందుకు 3,700 కిలోల పేలుడు పదార్థాలను ఉపయోగించారు. ఈ సౌధాలు ధ్వంసమయ్యే ముందు, పక్కనే ఉన్న ఎమరాల్డ్ కోర్టు, ఏటీఎస్ విలేజ్ సొసైటీలలోని దాదాపు 5 వేల మంది నివాసితులు ఈరోజు కోసం తమ ఇళ్లను ఖాళీ చేశారు. పిల్లలు,

- మిగతా 2 లో

స్ఫూర్తి నింపిన సీపీఐ రాష్ట్ర మహాసభలు

ఆసక్తికరంగా చర్చలు
52 తీర్మానాలు ఆమోదం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: సీపీఐ రాష్ట్ర 27వ మహాసభలు విజయవంతంగా ముగిశాయి. విశాఖపట్నంలో దాదాపు 48 సంవత్సరాల తర్వాత జరిగిన మహాసభలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. తొలిరోజు జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి గురజాడ కళాక్షేత్రం వరకు వేలాదిమంది పార్టీ శ్రేణులతో భారీ ప్రదర్శన జరిగింది. అనంతరం గురజాడ కళాక్షేత్రంలో బహిరంగసభ నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీవీ సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథులుగా సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, కార్యవర్గ సభ్యులు డి.అనీరాజా, సినీ, సంగీత దర్శకులు వందేమాతరం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ బహిరంగ సభలో నేతలు చేసిన ఉపన్యాసాలు పార్టీ శ్రేణులను ఉత్తేజపర్చాయి. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనా (కొల్లి నాగేశ్వరరావు సభా ప్రాంగణం)లో 27, 28 తేదీల్లో ప్రతినిధుల సభలు జరిగాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన సీపీఐ, ప్రజా సంఘాలకు చెందిన సుమారు 650 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ప్రతినిధుల సభను డి.రాజా ప్రారంభించి, జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలను సమగ్రంగా వివరించారు. పార్టీ నిర్మాణంపై సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. రామకృష్ణ కార్యదర్శి నివేదిక సమర్పించగా, దానిపై ప్రతినిధులు పెద్దసంఖ్యలో చర్చలో పాల్గొన్నారు. మూడు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ చేస్తున్న ఆందోళనా కార్యక్రమాలను అందరూ కొనియాడారు. ముఖ్యంగా ప్రత్యేక హోదా, విభజన అంశాల అమలుపై సుదీర్ఘ పోరాటం, అమరావతి రాజధాని రైతుల పోరాటానికి మద్దతుగా ఆందోళనలు, పోలవరం నిర్వాసితులకు అండగా ఉద్యమాలు, సీపీఎస్, ఇతర అంశాలపై సాగించిన పోరాటాలను ప్రస్తావించారు. చర్చలు అత్యంత ఆసక్తికరంగా సాగాయి. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై దాదాపు 52 కీలక అంశాలపై మహాసభ తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదించింది. అర్హతల కమిటీ నివేదికను రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య ప్రవేశపెట్టగా, ఆడిట్ నివేదికను రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.చెంచయ్య ప్రవేశపెట్టారు.

ఉద్యమాలే శరణ్యం: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విస్తృత ఉద్యమాలు నిర్వహించడమే తప్ప వేరే మార్గం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ స్పష్టం చేశారు. సీపీఐ రాష్ట్ర 27వ మహాసభల్లో ప్రవేశపెట్టిన రాజకీయ, నిర్మాణ కార్యదర్శి నివేదికలపై రెండు రోజుల విస్తృత చర్చ అనంతరం ఆయన సమాధానమిచ్చారు. కనీవినీ ఎరుగని

- మిగతా 2 లో

ఖాకీ మయం

ఉద్యోగులపై ఉక్కుపాదం

- సీపీఎస్ రద్దు ఉద్యమాన్ని అణచివేసే చర్యలు
- సీఎం ఇంటి దగ్గర భారీ బందోబస్తు
- విజయవాడ సరిహద్దుల్లో జల్లెడ
- అడుగడుగునా ఆంక్షలు-నిర్బంధాలు
- 15 వేల మందికి పైగా పోలీసుల పహారా
- ప్రభుత్వ చర్యలపై సీపీఐ, సీపీఎం, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ధ్వజం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉద్యోగులు, ఉపాధ్యాయులపై జగన్ సర్కారు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. పోలీసులతో ఉద్యమ అణచివేత చర్యలకు దిగుతూ, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తోంది. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మరోమారు ఉద్యమానికి సన్నద్ధమయ్యాయి. ప్రభుత్వం అప్రమత్తమై పోలీసుల ద్వారా ఎక్కడికక్కడే బైండోవర్ కేసులు, ముందస్తు నోటీసులతో సీపీఎస్ ఉద్యోగ సంఘాలు, వారికి మద్దతిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలను బెదిరింపులకు పాల్పడుతోంది. జిల్లాల నుంచి అడుగు బయటకు పెట్టకుండా ముఖ్యనేతలను నిర్బంధిస్తున్నారు. మరోవైపు

- మిగతా 2 లో

ఉద్యోగులపై ఉక్కుపాదం తగునా?
సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉద్యోగులు, ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు పాద మోపడం తగునా? అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశ్నించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేయాలని కోరుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు సెప్టెంబర్ 1న తలపెట్టిన మిలియన్ మార్చ్ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశ్వ ప్రయత్నం చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఏపీ పోలీసులు వారంరోజుల

- మిగతా 2 లో

ట్రంప్‌కు బిగుస్తున్న ఉచ్చు..

ఇంటి నుంచి రహస్య పత్రాల స్వాధీనం..

2లో

అక్టోబరు 17న కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక

19న కౌంటింగ్ - సెప్టెంబరు 22న నోటిఫికేషన్ : సీడబ్ల్యూసీ నిర్ణయం

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలపై ఉత్కంఠకు తెరదిగింది. అక్టోబరు 17న ఎన్నిక నిర్వహించాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) ఆదివారం నిర్ణయించింది. విజేతను రెండు రోజులు తర్వాత ప్రకటిస్తారు. అధ్యక్షుడిని ప్రజాస్వామికంగా ఎన్నిక చేసే ఏకైక పార్టీ ఇదొక్కటే. కాంగ్రెస్ అధ్యక్షుడి ఎన్నిక కోసం సెప్టెంబరు 22న నోటిఫికేషన్ విడుదల చేసి, 24న నామినేషన్ ప్రక్రియ, అక్టోబరు 1 నుంచి నామినేషన్ పత్రాల పరిశీలన, అక్టోబరు 8 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు, అక్టోబరు 17న ఓటింగ్, 19న కౌంటింగ్ అనంతరం ఫలితాలు వెలువడనున్నట్లు 30 నిమిషాల సమావేశం అనంతరం సీనియర్ నేత మధుసూదన్ మిస్త్రీ వెల్లడించారు. విదేశాల్లో ఉన్న కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమావేశంలో

- మిగతా 2 లో

అక్టోబరు 17న కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొన్నారు. పార్టీ సీనియర్లు హరీశ్ రావత్, సల్మాన్ ఖుర్షీద్, ముకుల్ వాస్నిక్, మల్లికార్జున్ ఖర్గే, కుమారి సెల్జా, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, అజయ్ మాకెన్, అభిషేక్ మను సింఘ్వీ సహా కొందరు కాంగ్రెస్ కార్యాలయం నుంచి పాల్గొన్నారు. సీడబ్ల్యూసీ సమావేశానికి పార్టీపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆనంద్ శర్మ కూడా హాజరయ్యారు. 2000 నవంబరు తర్వాత అధ్యక్ష ఎన్నికను కాంగ్రెస్ నిర్వహించనుంది. కుటుంబ రాజకీయాల వ్యవహారంలో బీజేపీ తరచూ కాంగ్రెస్‌పై, గాంధీ కుటుంబంపై విమర్శనాస్త్రాలు సంధిస్తూనే ఉంది. సోనియాగాంధీ ఈ పార్టీకి సుదీర్ఘకాలం నాయకత్వం వహించారు. సీడబ్ల్యూసీ ఆన్‌లైన్ సమావేశం ఏకగ్రీవంగా ఎన్నికల తేదీని ఆమోదించింది. వైద్యం కోసం విదేశాలకు వెళ్లిన సోనియాగాంధీ అక్కడ నుంచే సమావేశానికి అధ్యక్షత వహించారు. కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన రాజ్యసభ మాజీ ఎంపీ గులాం నబీ ఆజాద్‌తో ఆనంద్‌శర్మ భేటీ అయ్యారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ సెప్టెంబరు 7న కన్యాకుమారి నుంచి 'భారత్ జోడో యాత్ర' ప్రారంభించబోతోంది. 148 రోజుల యాత్ర కాశ్మీర్‌లో ముగుస్తుంది. ఐదు నెలల ప్రయాణం 3,500 కిలోమీటర్ల దూరం, 12 కంటే ఎక్కువ రాష్ట్రాల గుండా సాగబోతోంది. ఇందులో ర్యాలీలు, బహిరంగ సభలు ఉంటాయి. వీటిలో సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో సహా సీనియర్ కాంగ్రెస్ నాయకులు కూడా హాజరవుతారని విలేకరులతో మాట్లాడిన మిస్త్రీతో పాటు సీనియర్ నేతలు జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్ అన్నారు. సెప్టెంబరు 4న న్యూఢిల్లీలో చేపట్టనున్న 'మెహంగాయి పర్ హల్లా బోల్' ర్యాలీని విజయవంతం చేయాలని సీడబ్ల్యూసీ పునరుద్ఘాటించిందని చెప్పారు. సోనియాగాంధీ త్వరగా కోలుకోవాలని సమావేశం ఆకాంక్షించిందని అన్నారు. భారత్ జోడో యాత్ర పనుల్లో నిమగ్నమైన నేతలు ఓటింగ్‌లో పాల్గొనేందుకు తగు ఏర్పాట్లు చేస్తామని, ప్రతినిధులంతా ఓట్లు వేసేలా, అధ్యక్ష ఎన్నిక సజావుగా సాగేలా చూస్తామని అన్నారు.

అలా చేస్తే మనుగడ కష్టం : చవాన్

తోలుబొమ్మ అధ్యక్షుడు ఉంటే కాంగ్రెస్ మనుగడ కష్టమని మహారాష్ట్ర మాజీ సీఎం పృథ్వీరాజ్ చవాన్ హెచ్చరించారు. అశోక్ గెహ్లాట్‌తో పాటు అర్హులైన ఇతరుల పేర్ల ప్రస్తావన గురించి మాట్లాడుతూ, ఎన్నికలకు ముందే అధ్యక్ష పేరును నిర్ణయిస్తారన్నారు. ముందే పేరు నిర్ణయించేసేటప్పుడు ఎన్నిక నిర్వహించడంలో అర్థమేమిటి అని ప్రశ్నించారు. ఎన్నికలు నిర్వహించండి. ఎవరు పోటీ చేస్తారో చేయనివ్వండి. పోటీ జరగనివ్వండి. సమర్థుడికి పగ్గాలు అప్పగించండి. వెనుక ఉండి ముందర తోలుబొమ్మ అధ్యక్షుడిని నడిపించాలని చూస్తే పార్టీ మనుగడ సాగించలేదు అని చవాన్ ఘాటుగా వ్యాఖ్యానించారు. సోనియాతో గెహ్లాట్ భేటీ కారణంగా ఆయనే తదుపరి అధ్యక్షుడన్న నిర్ణయం జరిగినట్లు ఊహాగానాలు ఉన్నాయి.

బీజేపీకి సహకరించే ఎవరితోనైనా యుద్ధమే

(మొదటిపేజీ తరువాయి)

కావాలన్నారు. పార్టీ బలోపేతానికి నేతలు కార్యాచరణ రూపొందించుకోవాలని, నిర్మాణానికి సంబంధించి తీసుకోవాల్సిన చర్యల గురించి నారాయణ వివరించారు. సమస్య ఎక్కడ ఉంటే అక్కడ తెల్లకొంగల్లా కమ్యూనిస్టులు వాలిపోవాలని, అప్పుడే పార్టీ విస్తరణ, అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. సమస్య ఉన్న ప్రాంతంలో పార్టీ లేదని వెళ్లకుండా, పట్టించుకోకుండా ఉండకూడదన్నారు. ఎవరో చేసే ఉద్యమాలకు మద్దతు తెలియజేయడం వల్ల పార్టీ బలోపేతం కాదని, సమస్య పరిష్కారానికి కృషి చేసినప్పుడు సత్ఫలితాలు వస్తాయన్నారు. కమ్యూనిస్టు అనేవాడు సమస్యను గుర్తించగలగాలని, రాత్రి, పగలు అనే తేడా లేకుండా నీరున్న చోట తెల్లకొంగ వాలినట్లుగా అక్కడకు వెళ్లిపోవాలన్నారు. ఆ సమస్య పరిష్కారం కోసం పోరాడే విషయంలో జైలుకి వెళ్లడానికి కూడా వెనుకాడకూడదన్నారు. అలాంటి త్యాగాలకు సిద్ధమైనప్పుడు, మనం చేసే పోరాటంలో నిజాయతీ ఉన్నప్పుడు ప్రజలు తప్పనిసరిగా మనవైపే ఉంటారని నారాయణ అన్నారు. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవడం, కొత్త సమస్యలను గుర్తించడం, ఆధునిక పోకడలకనుగుణంగా పోరాట పంథా మార్చుకోవడం ద్వారా కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేయాలన్నారు. ముఖ్యంగా పార్టీలో చురుకుగా పనిచేసేవారిని, నాయకత్వ లక్షణాలను గుర్తించి అటువంటివారిని ప్రోత్సహించడం పార్టీ నిర్మాణంలో కీలకాంశంగా పేర్కొన్నారు. నేతలు హక్కుల గురించి కాకుండా బాధ్యతలు గుర్తెరిగి పనిచేయాలని ఉద్బోధించారు. పార్టీ నిర్మాణం, ప్రజాసంఘాల బలోపేతం, సమీకరణ శక్తి పెంపుపై దృష్టి పెట్టాలన్నారు. పార్టీ శాఖలు ఆర్థిక పరిపుష్టి కలిగి ఉండాలని, ఇందుకోసం ప్రజలను పెద్దసంఖ్యలో భాగస్వాములను చేయాలని సూచించారు. విద్యుత్ చార్జీల పెంపు, వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్ల బిగింపు ప్రక్రియపై గతంలో జరిగిన విద్యుత్ ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరో చారిత్రక పోరుకు సిద్ధం కావాలని నారాయణ పిలుపునిచ్చారు. ప్రతినిధుల సభకు ముప్పాళ్ల నాగేశ్వరరావు, పి.హరినాథరెడ్డి, విమల, కోనాల భీమారావు, అఫ్సర్ అధ్యక్షవర్గంగా వ్యవహరించగా, వేదికపై సీపీఐ ప్రధానకార్యదర్శి డి.రాజా, కార్యవర్గసభ్యులు అనీరాజా, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, కార్యదర్శివర్గ సభ్యులు రావుల వెంకయ్య, జల్లి విల్సన్, జి.ఓబులేసు, అక్కినేని వనజ, జి.ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఉన్నారు.

స్ఫూర్తి నింపిన సీపీఐ రాష్ట్ర మహాసభలు

(మొదటిపేజీ తరువాయి)

రీతిలో ఓ వైపు మోదీ ప్రభుత్వం మతోన్మాద విచ్ఛిన్నకర చర్యలకు పాల్పడుతుండగా, మరోవైపు జగన్ సారథ్యంలోని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో దించుతూ, అరాచక చర్యలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో 26 జిల్లాల్లోని పార్టీ శ్రేణులు సరికొత్త వ్యూహాత్మక విధానాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుశ్చర్యలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అక్టోబరు 14-18 తేదీల్లో విజయవాడలో జరిగే సీపీఐ 24వ జాతీయ మహాసభలను జయప్రదం చేయడానికి శాయశక్తులా కృషి చేయాలని కోరారు.

పోప్ కార్డినల్‌గా తెలుగు బిషప్

వాటికన్ సిటీ: హైదరాబాద్ ఆర్చ్ బిషప్‌గా వ్యవహరిస్తున్న పూల ఆంథోనీ తాజాగా ఓ అరుదైన గుర్తింపును సంపాదించారు. పోప్ ఫ్రాన్సిస్‌కు కార్డినల్‌గా ఎంపికైన తొలి తెలుగు బిషప్‌గా ఆయన రికార్డులకెక్కారు. ఈ మేరకు వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్స్ బాసిలికాలో శనివారం జరిగిన వేడుకలో పోప్ కార్డినల్‌గా పూల ఆంథోనీ బాధ్యతలు స్వీకరించారు. కన్నుల పండువగా జరిగిన ఈ వేడుకను వీక్షించేందుకు హైదరాబాద్ నుంచి పెద్ద సంఖ్యలో క్రైస్తవ ప్రముఖులు వాటికన్ సిటీకి వెళ్లారు. ఏపీలోని కర్నూలు జిల్లాకు చెందిన పూల ఆంథోనీ... 1992లో మత గురువుగా బాధ్యతలు చేపట్టారు. రోమన్ కథోలిక్స్‌కు సంబంధించి కర్నూలు డయాసిస్‌కు బిషప్‌గా ఆయన 2008లో బాధ్యతలు చేపట్టారు. నాటి నుంచి రెండు తెలుగు రాష్ట్రాల రోమన్ కథోలిక్ వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరిస్తూ వచ్చిన ఆంథోనీ... తాజాగా పోప్ కార్డినల్‌గా ఎంపికయ్యారు. ఆయా వ్యవహారాల్లో పోప్‌కు సలహాలు, సూచనలు అందజేసేందుకు నియమితులయ్యే వారినే కార్డినల్స్ అంటారు.

ట్రంప్‌కు బిగుస్తున్న ఉచ్చు..

ఇంటి నుంచి రహస్య పత్రాల స్వాధీనం..

వాషింగ్టన్: 2024 అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న డొనాల్డ్ ట్రంప్ కష్టాల్లోకి జారుకుంటున్నారు. అమెరికా అధ్యక్షునిగా ఉన్నప్పుడు ఆయన చేసిన నిర్వాకాలు క్రమంగా బయటపడుతున్నాయి. క్యాపిటల్ హిల్స్‌పై దాడి కేసులో దర్యాప్తును ఎదుర్కొంటున్న ట్రంప్‌పై ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్-ఎఫ్‌బీఐ చేపట్టిన దర్యాప్తులో విస్తుపోయే అంశాలు వెలుగు చూశాయి. ఇటీవల ఎఫ్‌బీఐ అధికారులు ఫ్లోరిడాలోని పామ్ బీచ్‌లో ఉన్న ట్రంప్ నివాసం మార్-ఎ-లాగో భవనంలో సోదాలు జరిపారు. ఈ తనిఖీల్లో కీలక విషయాలు వెలుగు చూశాయి. ఆ ఇంటిలో దేశానికి చెందిన కీలక పత్రాలు దొరికాయి. ఇవన్నీ అక్కడి వార్తా పత్రికలు, మ్యాగజైన్లలో దాచి పెట్టారని ఎఫ్‌బీఐ తన అఫిడవిట్‌లో తెలిపింది. 15 బాక్సుల్లో ఈ పత్రాలు దొరికాయి. ఇందులో 67 విశ్వసనీయ, 92 రహస్య, 25 అత్యంత రహస్య పత్రాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పత్రాలన్నీ ట్రంప్ అధ్యక్షునిగా ఉన్న సమయంలో ఇక్కడికి తరలించాని భావిస్తున్నారు. ట్రంప్ శ్వేతసౌధం ఖాళీ చేసే సమయంలో హడావుడిగా తీసుకొచ్చిన పత్రాల్లో ఇవన్నీ ఉన్నాయని చెబుతున్నారు. ఈ పత్రాలను ట్రంప్ తిరిగి ప్రభుత్వానికి ఇచ్చేయాల్సి ఉన్నా, ఎందుకు ఇవ్వలేదని ఎఫ్‌బీఐ అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల ఫ్లోరిడాలోని తన నివాసంపై ఎఫ్‌బీఐ అధికారులు సోదాలు చేపట్టినప్పుడు బైడెన్ ప్రభుత్వం మీద తీవ్ర విమర్శలు చేశారు ట్రంప్. వచ్చే ఎన్నికల్లో తాను మళ్లీ పోటీ చేయకుండా అడ్డుకునేందుకే డెమోక్రాట్లు ఈ కుట్రలు పన్నారని ఆరోపించారు. రాజకీయ కక్షసాధింపు అని ఆరోపించారు. గతంలో ఏ మాజీ అధ్యక్షుని నివాసంలో తనిఖీలు జరగలేదని, తన ఇంటిలో జరపాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. అమెరికాలో మధ్యంతర ఎన్నికల సమయంలో ఈ తనిఖీలు రాజకీయాంశంగా మారిపోయాయి.

షింజో అబేను చంపింది అందుకే....

హంతకుడు యమగామి లేఖ
ప్రజల నుంచి సానుభూతి
అతని కోసం 7000 మంది లేఖ

టోక్యో : జపాన్‌లో అత్యంత ప్రజాదరణ ఉన్న మాజీ ప్రధాన మంత్రి షింజో అబే ఈనెల 8న ఎన్నికల ప్రచార సభలో హత్యకు గురయ్యారు. హంతకుడు టెత్సుయా యమగామిని భద్రతా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అయితే షింజో అబేను తాను ఎందుకుహత్య చేయాల్సి వచ్చిందో వివరిస్తూ ఓ లేఖను యమగామి విడుదల చేశాడు. తన నేరాన్ని అంగీకరించాడు. అటువంటి గొప్ప నేతను చంపిన తనను కఠినంగా శిక్షించాల్సిందే అన్నాడు. తన తల్లి ఆస్తులన్నింటినీ అమ్మి ఒక మత సంస్థకు భారీగా విరాళాలు ఇవ్వడంతో కుటుంబం ఆర్థికంగా చితికి పోయిందని, భవిష్యత్తుపై అభద్రతతో సోదరుడు ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పుకొచ్చా. తన తల్లి విరాళాలిచ్చిన మత సంస్థకు అండగా అబే నిలవడం తనకు ఆగ్రహం తెప్పించిందని లేఖలో యమగామి పేర్కొన్నాడు. ఈ లేఖ దేశంలోని నిరుద్యోగుల మనస్సును కదిలించింది. అతనిపై సానుభూతి వ్యక్తం చేసిన కొందరు కానుకలను జైలుకు పంపుతున్నారు. తన పక్షాన్ని అందరి ముందు ఉంచే అవకాశాన్ని అతనికి ఇవ్వాలంటూ 7000 మంది సామూహిక లేఖను పిటిషన్ రూపంలో కోర్టుకు పంపారు. యమగామి ఈ హత్య చేయకుండా తన ఆవేదన సమాజానికి తెలియజేసి ఉంటే మరింత ఎక్కువ సానుభూతి లభించేదంటూ జపాన్ ప్రజలు పేర్కొన్నారు. ఇదిలావుంటే, సెప్టెంబరు 27న షింజో అబే అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించాలని జపాన్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఏర్పాట్లు చేసింది. అబే అంత్యక్రియల్లో భారత ప్రధాని నరేంద్రమోదీ పాల్గోనున్నారు. టోక్యోలోని కిటానోమారు నేషనల్ గార్డెన్‌లోని నిప్పన్ బుడోకాన్ అరీనాలో అబేకు అంతిమ వీడ్కోలు పలకనున్నట్లు సమాచారం.

26 చైనీస్ విమానాలను నిలిపివేసిన అమెరికా..

వాషింగ్టన్: నాలుగు చైనా క్యారియర్‌ల ద్వారా అమెరికా నుంచి చైనాకు వెళ్లే 26 విమానాలను నిలిపివేస్తున్నట్లు అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. జియామెన్, ఎయిర్ చైనా, చైనా సదరన్ ఎయిర్ లైన్స్, చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన 26 విమానాలను సెప్టెంబరు 5 నుంచి 28 వరకు నిలిపివేయనున్నట్టు పేర్కొంది. కోవిడ్ కేసుల కారణంగా 26 అమెరికన్ ఎయిర్లైన్స్, డెల్టా ఎయిర్ లైన్స్, యునైటెడ్ ఎయిర్లైన్స్ విమానాలను రద్దు చేసినట్లు అమెరికా డిపార్ట్మెంట్ ఆఫ్ ట్రాన్స్‌పోర్టేషన్ తెలిపింది. లాస్ ఏంజిల్స్ నుంచి 19 విమానాలు, న్యూయార్క్ నుంచి ఏడు చైనా ఈస్టర్న్ విమానాలు రద్దు అయ్యాయి. దీనిపై వాషింగ్టన్‌లోని చైనా రాయబార కార్యాలయం ప్రతినిధి లియుపెంగ్యు స్పందించారు. అమెరికా అత్యంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని దుయ్యబట్టారు. ఆగస్టు 7 నాటికి చైనా అధికారులు తమ విధానాలను సవరించారని తెలిపారు. ఇదిలావుంటే, కోవిడ్ మహమ్మారి ప్రారంభమైనప్పటి నుంచి బీజింగ్, వాషింగ్టన్ విమాన సేవలపై ప్రభావం కనిపిస్తూనే ఉంది. 2021, ఆగస్టులో యూఎస్ డీవోటీ నాలుగు యునైటెడ్ ఎయిర్లైన్స్ విమానాలపై బీజింగ్ పరిమితులను విధించిన తరువాత నాలుగు వారాల పాటు చైనా క్యారియర్ల విమానాలను 40 శాతం సామర్థ్యానికి అమెరికా పరిమితం చేసింది. అయితే తాజా పరిణామాలకు ముందు మూడు యుఎస్ విమానయాన సంస్థలు, నాలుగు చైనీస్ క్యారియర్లు ఇరు దేశాల మధ్య వారానికి 20 విమానాలను నడుపుతున్నాయి. గతంలో 100 కంటే ఎక్కువ విమానాలు రెండు దేశాల మధ్య రాకపోకలు సాగించేవి.

ఖాకీ మయం

(మొదటిపేజీ తరువాయి)

సెప్టెంబరు 1న ఉద్యోగులెవరూ కారణం లేకుండా సెలవులు పెడితే, దానిని అనుమతించవద్దనీ, అలాంటి వారిపై కఠిన చర్యలుంటాయని ఆయా జిల్లా కలెక్టర్లు, డీఈవోల ద్వారా ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వులు జారీజేశారు. ప్రభుత్వానికి దొరికిందే అవకాశం అన్న రీతిలో, పోలీసుల ద్వారా ఉద్యమకారులపై ఒత్తిళ్లు ప్రారంభించారు. ఇతర ప్రాంతాల నుంచి చలో సీఎం ఇంటి ముట్టడికి, చలో విజయవాడకు ఉపాధ్యాయ, ఉద్యోగులు రాకుండా, వారం రోజుల నుంచి పోలీసులు వారిని అడ్డుకుంటున్నారు. వారి ద్విచక్ర వాహనాలు, కార్లను పోలీసుస్టేషన్లలోకి తీసుకెళ్లిపోయారు. ఉద్యమం అణచివేతకు విజయవాడలో పోలీసులు పెద్దఎత్తున ట్రయిల్ బందోబస్తు రన్ నిర్వహించారు. నిబంధనలను అతిక్రమించి ఎవరైనా తరలివస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీపీఎస్ రద్దుపై జరగబోయే ఉద్యమాన్ని అణచివేసేందుకు 15 వేలకు పైగా రిజర్వుడు, సివిల్, ప్రత్యేక దళాల పోలీసు బెటాలియన్లను విజయవాడ నగరంలోకి దించారు. సీఎం ఇంటి పరిసర ప్రాంతాల్లో బందోబస్తు భారీగా పెంచేశారు. అక్కడ ప్రత్యేక దళాలను ఏర్పాటు చేశారు. విజయవాడ నగర సరిహద్దు ప్రాంతాలు, ముఖ్యకూడళ్లలో పోలీసులు పహారా కాస్తున్నారు. బారికేడ్లను ఏర్పాటు చేసి, అనుమానితులపై ఆరా తీస్తున్నారు. విజయవాడకు వచ్చే అన్ని రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లలో నిఘా ఉంచారు. ఈ ఉద్యమానికి మద్దతిస్తున్న వివిధ పార్టీ కార్యాలయాలు, ప్రజా సంఘాల నేతల కార్యాలయాలపై పోలీసులు దృష్టి సారించారు. గత చలో విజయవాడ ఉద్యమం విజయవంతాన్ని దృష్టిలో ఉంచుకుని, కళ్యాణ మండపాలు, ఉద్యోగ సంఘాల కార్యాలయాలను పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. పోలీసు చర్యలను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, తిమ్మన్న తదితర సంఘాలు ఖండించాయి. సీపీఎస్ రద్దు కోసం చేపట్టబోయే ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

1న చలో సీఎం నివాసం: ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, సెప్టెంబరు 1వ తేదీన చలో సీఎం నివాసం చేపడుతున్నామని, దీని విజయవంతానికి పార్టీలు, ప్రజా సంఘాలు సహకరించాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన విద్యా విధానంతో మొత్తం ప్రైవేటీకరణ వైపు మళ్లిస్తున్నారన్నారు. రాబోయే 15 ఏళ్లలో విద్యా విధానంలో సమూల మార్పులు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రకు పాల్పడుతోందన్నారు. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సి ఉందని అన్నారు. అగ్రిగోల్డ్ అసోసియేషన్ అధ్వర్యంలో గతంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఒకవైపు చేపడుతుంటే, మరోవైపు శాసనమండలిలో చర్చించామని గుర్తుచేశారు. చేనేత కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, రైతుల సమస్యలపై శాసనమండలిలో ప్రస్తావించామని వివరించారు. కరోనా రెండవ దశలో 7 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు మృతి చెందారని, వారి కుటుంబాలను ఆదుకునేందుకు కృషి చేశామన్నారు. సెప్టెంబర్ 1న సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ చలో ముఖ్యమంత్రి నివాసం కార్యక్రమాన్ని చేపడుతున్నామని చెప్పారు.

సీపీఎస్ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు: ఎస్టీయూ

సీపీఎస్ ఉద్యమానికి సంపూర్ణ మద్దతిస్తున్నట్లు ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్టీయూ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమం విజయవంతానికి కృషి చేయాలన్నారు. పోలీసు నోటీసులకు, బైండోవర్ కేసులకు భయపడవద్దని కోరారు. సెప్టెంబర్ 1, 2004న రాష్ట్రంలో సీపీఎస్ ప్రవేశ పెట్టిన రోజు అయినందున, ఆ రోజును విద్రోహ దినంగా పాటించాలని కోరారు. రాష్ట్ర స్థాయి నాయకులు నల్ల బ్యాడ్జి, నల్ల చొక్కాలు, మహిళా ఉపాధ్యాయులు నల్ల దుస్తులు ధరించి కలెక్టరేట్ల ఎదుట ఆ రోజు నిరసనల్లో పాల్గొంటామన్నారు. ఎన్నికల మేనిఫెస్టో బైబిల్, ఖురాన్, భగవద్గీతని సీఎం జగన్ హామీ ఇచ్చి, దానిని నిలబెట్టుకోలేక పోయారన్నారు. చర్చలతో సమస్యలు పరిష్కరించాలేగానీ, ఉద్యమాలను అణచివేయడం తగదన్నారు. శాంతియుత ఉద్యమాలను రెచ్చగొట్టడం ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. సీపీఎస్, జీపీఎస్ ఆలోచన పక్కకు పెట్టి తక్షణమే పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)పై చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు. రాజస్థాన్ రాష్ట్రంలో 5 లక్షల మంది ఉద్యోగులకు ఓపీఎస్ పునరుద్ధరణ చేయగా, రాష్ట్రంలో కేవలం రెండు లక్షల మంది ఉద్యోగులకు ఎందుకు అమలు చేయలేరని ప్రశ్నించారు.

ఉపాధ్యాయులపై నిర్బంధాన్ని ఆపండి : సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సీపీఎస్ వ్యతిరేకంగా సెప్టెంబరు 1న చలో విజయవాడ పిలుపును భగ్నం చేసేందుకు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కార్మిక, ఉద్యోగ సంఘాల నాయకుల పట్ల పోలీసులు అమానుషంగా ప్రవర్తిస్తూ భయానక వాతావరణాన్ని సృష్టించడాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఖండించారు. తక్షణం ఈ నిర్బంధాన్ని ఆపి శాంతియుతంగా జరిపే విజయవాడ ప్రదర్శనకు అనుమతించా లని, ఉపాధ్యాయ సంఘాలతో సీపీఎస్‌పై చర్చించాలని డిమాండ్ చేశారు. నాడు సీపీఎస్ రద్దు చేస్తామని జగన్ హామీ ఇచ్చి, ఇవాళ ఉద్యోగులకు భ్రమలు కల్పించారన్నారు. ప్రభుత్వం మధ్యలో జీపీఎస్‌ను తెరపైకి ప్రభుత్వం తెచ్చి ప్రజలను, ఉద్యోగులను గందరగోళానికి గురిచేస్తోందన్నారు. ఈ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని విమర్శించారు. ఉపాధ్యాయులపై పెట్టిన బెండోవర్ కేసులను తక్షణం ఉపసంహరించుకోవాలని, ఉపాధ్యాయుల పట్ల శత్రు వైఖరిని విడనాడి వారితో చర్చలు జరిపి సామరస్యంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగులపై ఉక్కుపాదం తగునా?

(మొదటిపేజీ తరువాయి)

ముందు నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ముందస్తు నోటీసులు జారీ చేయటం, పోలీస్ స్టేషన్లకు తరలించడం, వాహనాలను సీజ్ చేయటం వంటి దుశ్చర్యలకు పాల్పడటం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పోలీసు చర్యల్ని తప్పుబట్టారు. రాష్ట్రంలో ప్రజాస్వామిక పాలన ఉందా? లేక నియంత రాజ్యం కొనసాగుతోందా? అని ధ్వజమెత్తారు. కుప్పంలో విధ్వంసానికి తెరతీసిన వైసీపీ నిరసనలకు అనుమతి ఇచ్చిన పోలీసులు... ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేసే శాంతియుత మిలియన్ మార్చ్‌కు అనుమతి ఇవ్వరా? విజయవాడలో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ చేసి బెదిరింపులకు పాల్పడటం తగునా? అని ప్రశ్నించారు. శాంతియుత ప్రజా ఉద్యమాలను అణచివేసేందుకు కుట్ర చేయడం సరైంది కాదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులపై జగన్ ప్రభుత్వ నిర్బంధ విధానాలు విడనాడాలని హితవు పలికారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాను అధికారం చేపట్టిన వెంటనే సీపీఎస్ రద్దు కోసం కృషి చేస్తానని వాగ్దానం చేసిన జగన్...మాట తప్పి, మడమ తిప్పారన్నారు. మూడేళ్ల పాటు తమకు న్యాయం జరుగుతుందని ఆశించిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉద్యమానికి సిద్ధమయ్యారని తెలిపారు. ఇప్పటికైనా జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే సీపీఎస్ రద్దు కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

11శాతం క్షీణత

జులైలో పడిపోయిన డీజిల్ ఎగుమతులు

న్యూఢిల్లీ : డీజిల్ ఎగుమతులు జులైలో 2.45 మిలియన్ టన్నుల నుంచి 2.18 మిలియన్ టన్నులకు పడిపోయాయి. భారతదేశం డీజిల్ ఎగుమతులు జులైలో 11శాతం పడిపోయాయని అధికారిక డేటా పేర్కొంది. ప్రభుత్వం అటువంటి అమ్మకాలపై విండ్‌ఫాల్ ప్రాఫిట్ ట్యాక్స్‌ను విధించిన తర్వాత పెట్రోల్ విదేశీ రవాణా 4.5 శాతం తగ్గింది. డీజిల్ దిగుమతులు 2.45 మిలియన్ టన్నుల నుంచి 2.18 మిలియన్ టన్నులకు పడిపోయినట్లు చమురు శాఖ పెట్రోలియం ప్లానింగ్ అండ్ ఎనాలిసిస్ సెల్ (పీపీఏసీ) డేటా ద్వారా తెలిసింది. జూన్‌లో పెట్రోల్ ఎగుమతులు 1.16 మిలియన్ టన్నుల నుంచి 1.1 మిలియన్ టన్నులకు పడిపోయాయి. జులై 1న విండ్‌ఫాల్ ప్రాఫిట్ ట్యాక్స్‌లను ప్రభుత్వం విధించింది. పెట్రోల్, ఏవియేషన్ టర్బైన్ ఇంధనంపై లీటరుకు రూ.6, డీజిల్‌పై లీటరుకు రూ.13 ఎగుమతి సుంకాలు విధించబడ్డాయి. ఎగుమతి సుంకాలు దేశీయ ఇంధన సరఫరాపై ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడ్డాయి. స్థానికంగా సరఫరా చేయడానికి బదులుగా తమ ఇంధనం కోసం విదేశీ మార్కెట్‌లను ఎంచుకొనే రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, నాయరా ఎనర్జీ వంటి సంస్థలను నిరోధించే లక్ష్యంతో ఈ సుంకాలు విధించబడ్డాయి. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్) మార్కెట్‌లో 90 శాతం నియంత్రిస్తున్నాయి. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకుగాను ప్రభుత్వానికి దోహదమయ్యేలా నష్టాలకు పెట్రోల్, డీజిల్‌ను విక్రయిస్తున్నాయి. మరోవైపు ప్రైవేటు కంపెనీలు నష్టాలను భరించాల్సి వస్తుందని తమ ఇంధనాన్ని అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయిస్తున్నాయి.

ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం వల్ల కూడా ఇంధన ధరలు అంతర్జాతీయంగా పెరిగాయి. జులైలో 4.68 మిలియన్ టన్నుల పెట్రోలియం ఉత్పత్తులను భారత్ ఎగుమతి చేసింది. అందులో 82శాతం పెట్రోల్, డీజిల్, ఏటీఎఫ్ ఉన్నాయి. ఏటీఎఫ్ ఎగుమతులు 583,000 టన్నుల వరకు జులైలో జరిగింది. అంతకుముందు నెల 591,000 టన్నులు ఎగుమతి అయ్యాయి అని పీపీఏసీ డేటా చెబుతోంది. మార్చిలో డీజిల్ ఎగుమతులు 3.36 మిలియన్ టన్నులకు చేరింది. ఆ తర్వాత నెల 2.7 మిలియన్ టన్నులకు పడిపోయింది. మరలా మేలో 3.05 మిలియన్ టన్నులకు పెరిగింది. జూన్‌లో 2.45 మిలియన్ టన్నులకు తగ్గిపోయింది. 2020 ఏప్రిల్‌లో 3.4 మిలియన్ టన్నుల ఇంధనం రవాణా చేయబడినప్పుడు అత్యధిక మొత్తంలో డీజిల్ ఎగుమతి చేయబడింది. పెట్రోలు ఎగుమతులు మార్చిలో 1.6 మిలియన్ టన్నులకు చేరుకున్నాయి.

క్షణాల్లో కూలిన సౌధాలు

(మొదటిపేజీ తరువాయి)

కుక్కలతో సహా దాదాపు 3 వేల వాహనాలు, 150-200 పెంపుడు జంతువులను కూడా తీసుకెళ్లారు. నిర్మాణాలను కూల్చివేయడం వల్ల 35 వేల క్యూబిక్ మీటర్లు లేదా 55 వేల టన్నుల నుంచి 80 వేల టన్నుల శిథిలాలు మిగిలి ఉన్నాయి. ఇందులో ప్రధానంగా కాంక్రీట్ రాళ్లు, ఉక్కు, ఇనుప కడ్డీలు ఉంటాయి. వాటిని సరిగ్గా తొలగించడానికి మరో మూడు నెలలు పడుతుంది. రెండు భవనాల్లో 7 వేల రంధ్రాలు చేసి అందులో పేలుడు పదార్థాలు నింపారు. 20 వేల సర్క్యూట్లను ఏర్పాటు చేశారు. 100 మీటర్ల దూరంలో ఉన్న బటన్ నొక్కడం ద్వారా భవనాలు నేలమట్టం అయ్యాయి. నోయిడా అథారిటీ మార్గదర్శకత్వంలో సూపర్‌టెక్ సంస్థ తన సొంత ఖర్చుతో భవనాలను కూల్చివేసింది. ట్విన్ టవర్స్ కూల్చివేత నేపథ్యంలో చుట్టుపక్కల ప్రాంతాల్లో అనేక ఆంక్షలు అమలు చేశారు. ఈ జంట సౌధాలకు సమీపంలో ఉన్న భవనాల్లోకి దుమ్ము చొరబడకుండా జియో టెక్స్‌టైల్ కవరింగ్ ఉపయోగించారు. అలాగే సమీపంలోని ఎమరాల్డ్ కోర్టు, ఏటీఎస్ విలేజ్ సొసైటీలలో వంట గ్యాస్, విద్యుత్ సరఫరా కూడా నిలిపివేసినట్టుగా అధికారులు తెలిపారు. సౌధాల కూల్చివేత తర్వాత కాలుష్య స్థాయిలను పర్యవేక్షించేందుకు నోయిడాలోని సెక్టార్ 93ఏలోని కూల్చివేత స్థలంలో ప్రత్యేక డస్ట్ మెషీన్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పేలుడు పూర్తికావడంతో భద్రతా క్లియరెన్స్ అనంతరం ఎమరాల్డ్ కోర్టు, ఏటీఎస్ విలేజ్ సొసైటీలలోని నివాసితులను తిరిగి వారి ఇళ్లలోకి అనుమతించనున్నారు. ఇక ఈ కూల్చివేత సందర్భంగా ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే దానిని ఎదుర్కొనేందుకు వీలుగా అంబులెన్స్‌లు, ఫైర్ ఇంజన్లు సిద్ధంగా ఉంచారు. అలాగే ఫెలిక్స్ ఆస్పత్రిలో 50 బెడ్లను సిద్ధంగా ఉంచారు. ఎన్డీఆర్ఎఫ్, ఉత్తరప్రదేశ్ పోలీసు సిబ్బందిని క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచారు. జంట సౌధాల కూల్చివేత దృశ్యాలను అక్కడికి కొద్ది దూరంలో భవనాల నుంచి ప్రజలు వీక్షించారు. కాగా 'జిల్లా అధికారులతో కుమ్మక్కయి, నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేసిన ఈ జంట సౌధాలను కూల్చివేయాలని 2021 ఆగస్టు 31న సుప్రీం కోర్టు ఆదేశించింది. చట్టవ్యతిరేకమైన నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలని, చట్టబద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపింది. నోయిడా అథారిటీ అని కూడా పిలిచే న్యూ ఓఖ్లా పారిశ్రామిక అభివృద్ధి మండలి (నోయిడా) ఎమరాల్డ్ కోర్టు ప్రాజెక్టులో సూపర్‌టెక్ లిమిటెడ్‌తో దాని అధికారులు కుమ్మక్కయిన అనేక సంఘటనలను, రియల్ ఎస్టేట్ సంస్థ నిబంధనలను ఉల్లంఘించడాన్ని ఉన్నత న్యాయస్థానం ఎత్తిచూపింది. 'చట్టంలోని నిబంధనలను డెవలపర్ ఉల్లంఘించడంలో ప్లానింగ్ అథారిటీ దుర్మార్గపు సంక్లిష్టతను ఈ కేసు బహిర్గతం చేసింది' అని సుప్రీం కోర్టు పేర్కొంది. భవనం మ్యాప్‌లను మొదట ఆమోదించిన స్థానిక నోయిడా అభివృద్ధి మండలి దాదాపు ఏడాది కాలంగా ప్లానింగ్‌లో ఉన్న మెగా కూల్చివేత కసరత్తును పర్యవేక్షించింది. ముంబైకి చెందిన ఎడిఫైస్ ఇంజినీరింగ్ ఈ పనిని అప్పగించింది. దాని నైపుణ్యం కోసం దక్షిణాఫ్రికాకు చెందిన జెట్ డెమోలిషన్స్‌ను నియమించుకుంది. సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీబీఆర్ఐ) ఈ ప్రాజెక్టుకు సాంకేతిక నిపుణుడిగా సుప్రీం కోర్టు నియమించింది. ఎమరాల్డ్ కోర్టు ప్రాజెక్టు కోసం అసలు ప్రణాళికలో భాగం కాని జంట సౌధాల నిర్మాణం దాని నివాసితుల జీవన నాణ్యతను ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తుందని పేర్కొన్నందున కూల్చివేతకు అయ్యే ఖర్చును సూపర్‌టెక్ భరించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. 2020 జనవరిలో 18-20 అంతస్తుల భవనాలను సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా, తీర ప్రాంత నియంత్రణ జోన్ నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణం చేసిన కేరళలోని కొచ్చిలోని మరదు మునిసిపాలిటీ ప్రాంతంలోని నాలుగు గృహ సముదాయాలను కూల్చివేశారు. మరదు కాంప్లెక్స్‌ల కూల్చివేతకు కూడా ఎడిఫైస్, జెట్ డెమోలిషన్స్ సహకరించాయి. నవంబర్ 2019లో దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో 108 మీటర్ల ఎత్తయిన బ్యాంక్ ఆఫ్ లిస్బన్ భవనం కూల్చివేయడాన్ని జెట్ డిమోలిషన్స్ వ్యక్తిగతంగా విజయవంతంగా అమలు చేసింది.

సంక్షేమ పథకాలపైనే గెహ్లాట్ ఆశలు

తిరిగి అధికారంలోకి రావడమే లక్ష్యం
నేటి నుంచి గ్రామీణ ఒలింపిక్స్
పాల్గొననున్న 30 లక్షల క్రీడాకారులు

జైపూర్ : రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అధికారాన్ని నిలబెట్టుకోవడంపై దృష్టి సారించారు. అధికారంలో ఉండేందుకు కసరత్తు చేస్తున్నారు. తమ ప్రభుత్వ పథకాలపై నమ్మకం పెట్టుకున్నారు. ఇక ప్రజల్లోకి మరింతగా వెళ్లాలని నిర్ణయించుకున్నారు. గ్రామీణ ఒలింపిక్ క్రీడలపై దృష్టి పెట్టారు. సోమవారం నుంచి ఈ క్రీడలు ప్రారంభమవుతాయి. పురుషులు, మహిళలు కలిపి 30 లక్షల మంది క్రీడాకారులు పాల్గొనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఉద్యోగులకు పాత పింఛన్ పథకాన్ని, ఓపీడీలకు ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచిత వైద్యం, రూ.10లక్షల ఆరోగ్య బీమా, విద్యుత్ బిల్లులపై సబ్సిడీ, పట్టణ ఉద్యోగ భద్రత పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఏ తరహా), 1.33 కోట్ల మంది మహిళలకు స్మార్ట్‌ఫోన్ల పంపిణీ వంటి పథకాలను గెహ్లాట్ ప్రభుత్వం చేపట్టింది. ఇన్నిచేసినా గెహ్లాట్ సమస్యల సుడిగుండంలో చిక్కుకొని ఉన్నారు. దళితుల పరిస్థితిపై, శాంతి పరిస్థితుల గురించి గెహ్లాట్ ప్రభుత్వం విమర్శలను ఎదుర్కొంటుంది. ముఖ్యమంత్రి తన గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకున్నారని పార్టీ నేత ఒకరు చెప్పారు. మూడవసారి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆయన అనేక కోణాలను దృష్టిలో పెట్టుకొని పనిచేస్తున్నట్లు తెలిపారు. 2018 డిసెంబరులో గెహ్లాట్ సర్కార్ మూడవసారి అధికారంలోకి వచ్చింది. గెహ్లాట్ అనేక నిర్ణయాలను సమాజంలోని ప్రతివర్గం హితవు కోసం పథకాలను తీసుకు వచ్చారని చెప్పారు. రాష్ట్ర క్రీడా మంత్రి అశోక్ చందనా మాట్లాడుతూ, క్రీడాల క్రమంలో ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. 30 లక్షల మంది పాల్గొనడం క్రీడల చరిత్రలోనే తొలిసారిగా చెప్పారు. దీనివల్ల కలిగే రాజకీయ ప్రయోజనం గురించి విలేకరి ప్రశ్నించగా సమయమే నిర్ణయిస్తుంది అని ప్రజల నుంచి మంచి స్పందన ఉందని అన్నారు. మంచి చేసినప్పుడు సానుకూల ప్రభావం ఉంటుందన్నారు. క్రీడలతో కోటి మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ముడిపడి ఉంటారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. 2004 జనవరి తర్వాత దాదాపు మూడు లక్షల ఉద్యోగుల నియామకం జరిగింది. గెహ్లాట్ ఆరోగ్య రంగంపై దృష్టి సారించారు. గత సంవత్సరం చిరంజీవి ఆరోగ్య బీమా పరిధిని రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచారన్నారు. గత పదవీ కాలంలో ఉచిత ఔషధ పథకాలను ప్రారంభించారు. దీంతో ప్రజలకు ప్రయోజనం చేకూరింది. ఈసారి ఆరోగ్య రంగంపై సీఎం ఎక్కువగా దృష్టి సారించారు. పార్టీకి రాజకీయ మైలేజీ తప్పకుండా వస్తుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఏడాది బడ్జెట్‌లో గెహ్లాట్ అనేక పథకాలను ప్రకటించారు. ఇది కచ్చితంగా 2023లో పార్టీ పునరాగమనానికి పునాది వేస్తుంది. రైతులు, యువకులు, మహిళలు, పురుషులు, నిరుపేదలు, వృద్ధుల సంక్షేమానికి పథకాలు తెచ్చారని పార్టీ నేత ఒకరు అన్నారు. గతేడాది మే నుంచి నెలకు రూ.1,000 సబ్సిడీ ఇవ్వడం వల్ల లక్షలాది మంది రైతులకు విద్యుత్ బిల్లులు జీరోగా మారాయన్నారు. అదే సమయంలో గెహ్లాట్ నిర్విరామంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌పై విమర్శనాస్త్రాలు ఎక్కుపెడుతూనే ఉన్నారు. 13 జిల్లాల్లో తాగు-సాగునీటి అవసరాలను తీర్చేందుకు తూర్పు రాజస్థాన్ కెనాల్ ప్రాజెక్ట్‌ను తదుపరి ఎన్నికల అస్త్రంగా మార్చుకోవాలని అనుకుంటున్నారు. ఈ ప్రాజెక్టును సమయానికి పూర్తి చేసేలా కేంద్రం చొరవ చూపాలని డిమాండు చేస్తున్నారు. ఇదే అంశాన్ని తూర్పు ప్రాంతాల్లోని పార్టీ నేతలు, కార్మికులకూ సూచించారు. దీనిపై ఉద్యమం చేపట్టాలని సూచించారు. అన్ని పథకాలు, చర్యలను ఒకచోట చేర్చితే, వచ్చే ఎన్నికల్లో అధికారాన్ని నిలుపుకోవడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధమవుతుందని పార్టీ ఎమ్మెల్యే ఒకరు అన్నారు. పార్టీలో సవాళ్లు ఎదురైనా, ప్రభుత్వ సుస్థిరతకు బెదిరింపులు ఎదురైనప్పటికీ, గెహ్లాట్ మూడోసారి ముఖ్యమంత్రిగా ప్రజానుకూల కార్యక్రమాలపై దృష్టి సారించారని, అవే ఆయనకు తిరిగి అధికారాన్ని కట్టబెట్టగలవని చెప్పారు.

బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశంలో నిషేధించిన పుస్తకాలు

వాసిరెడ్డి నవీన్
సెల్: 9849310560

ఈ భూమి మీద విలువైన వస్తువు ఏది?'

'కొడుకును ఉరి తీస్తే తండ్రి కార్చిన కన్నీరు కాదు. భర్త చనిపోతే అతని చితిమీద 'సతి' అయిన ఆ ఇల్లాలి చితాభస్మం కూడా అంత విలువైనది కాదు. దేశవిముక్తి కోసం ఒక వీరుడు చిందించిన చివరి రక్తపుబొట్టు విలువైనది.' ఈ మాటలు స్వాతంత్ర్యోద్యమ జ్వాలకు ఆజ్యం పొయ్యవా మరి! అందుకే అది నిషేధానికి గురయింది. 1907లో ధనత్ రాయ్ లేదా నవాబ్ రాయ్ అనే మున్షీ ప్రేమ్‌చంద్ రాసిన తొలి కథ దునియాకే సబ్ సె అన్‌మోల్ రతన్ లో సంభాషణ ఇది. దీనితోపాటు అచ్చయిన మరో అయిదు కథల సంకలనం సోజే వతన్ ను 1909లో బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. అప్పటికే అమ్ముడుపోగా మిగిలిన అయిదువందల కాపీలను తగలబెట్టింది. ఇలా ఈ నిషేధాల పరంపర 1881లో బెంగాలీ నాటకం నీల్ దర్పణ్‌తో మొదలయింది.

బ్రిటిష్ ప్రభుత్వ పుస్తకాల పై విధించిన నిషేధాలను మూడు రకాలుగా విభజించవచ్చు. మొదటిది: బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వతంత్రేచ్ఛను ప్రకటించిన రచనలను నిషేధించడం. ఈ రకమైన నిషేధాలు 1909లో స్వరాజ్య తెలుగుపత్రిక సంపాదకీయాన్ని నిషేధించడంతో మొదలైంది. అది రాసినందుకు గాడిచర్ల హరిసర్వోత్తమ రావుకు మూడు సంవత్సరాల జైలు శిక్ష పడింది. ఆ తర్వాత ఆ నిషేధాలు నాటికలు, పాటల వైపుకు వెళ్లాయి. చిన్న చిన్న నాటికలు, హరికథలు వంటి రూపాల ద్వారా ప్రజలను చైతన్యపరుస్తున్న దామరాజు పుండరీకాక్షుడు నాటకాలపై నిషేధాల పరంపర కొనసాగింది. 1919లో జలియన్ వాలాబాగ్ దురంతాన్ని పంజాబ్ దురంతము అనే నాటకంగా రాసి, ప్రదర్శించారు. దాన్ని 1920 లో నిషేధించిన వెంటనే పేరు మార్చి పాంచాల పరాభవంగా ప్రదర్శిస్తే, అదీ నిషేధానికి గురయింది. ఇలా వీరివే గాంధీ మహోదయం, క్విట్ ఇండియా, దండి సత్యాగ్రహం, గాంధీ విజయ ధ్వజం వంటి రచనలు 1925 వరకు నిషేధానికి గురవుతూనే ఉన్నాయి. 1921లో స్వరాజ్య సాహసం అనే అముద్రిత నాటకాన్ని, కొడాలి ఆంజనేయులు రాసిన తిలక్ మహారాజ నాటకాన్ని, కలియుగ ప్రహ్లాద అనే హరికథను కూడ నిషేధించారు. దేశ చరిత్రలో ఒక పాట రాసినందుకు, దాన్ని పాడినందుకు తొలిసారిగా జైలుకెళ్లిన వ్యక్తి గరిమెళ్ల సత్యనారాయణ. 160 చరణాల మాకొద్దీ తెల్లదొరతనము... అనే ఈ అతి పెద్ద పాటను టంగుటూరి ప్రకాశం ఇంగ్లీషులోకి అనువదించి, తన స్వరాజ్య పత్రికలో ప్రచురించారు. దీన్ని అన్ని భాషల్లోకి అనువదించాలని గాంధీజీ సూచించారు. గరిమెళ్ల రాసిన స్వరాజ్య గీతాల పుస్తకం 1922లో నిషేధానికి గురయింది. పేరు లేకుండా ప్రచురించిన దీపాల పిచ్చయ్యశాస్త్రి స్వప్న ప్రయాణం పద్య గ్రంథాన్ని 1922లో నిషేధించగా, ఆ నిషేధపు ఉత్తర్వులో, పుస్తకాన్ని ప్రచురించిన నెల్లూరు వెంకట రామానాయుడుని రచయితగా పేర్కొన్నారు.

ఉన్నవ లక్ష్మీనారాయణ జైలులో ఉన్నప్పుడు రాసి బయటకు స్మగుల్ చేసి ప్రచురించిన మాలపల్లి నవలను 1923లో నిషేధించారు. తెలుగు సాహితీ రంగంలో ఇదొక సంచలనం. ఈనాటికీ ఈ నవల అనేక ముద్రణలు పొందుతూనే ఉంది. తెలంగాణ ప్రాంతంలో నిజాం ప్రభుత్వమే ఉన్నప్పటికీ నిషేధాల విషయంలో అది బ్రిటీష్ కనుసన్నల్లోనే మెలిగింది. హైదరాబాదులో కె.సి. గుప్తా స్థాపించిన 'అణా గ్రంథమాల' ప్రచురించిన సావర్కర్ జీవితచరిత్ర, వెల్దుర్తి మాణిక్యరావు రచించిన రైతు, ఎం.ఎన్.రాయ్ గ్రంథాలు 1940లో నిషేధానికి గురయ్యాయి. 30 పేజీల రైతు పుస్తకం వల్ల రైతుల్లో అశాంతి, తిరుగుబాటు వస్తుందని నిజాం ప్రభుత్వం భావించడం ఆశ్చర్యము, హాస్యాస్పదము. నిజాం నవాబు సంతకంతో ఈ నిషేధపు ఫర్మానా జారీ చేయటం మరీ విశేషం. మొత్తంగా సహాయ నిరాకరణోద్యమ కాలంలో ఈ నిషేధాల పరంపర ప్రధానంగా సాగింది.

రెండవది: కమ్యునిస్టు భావజాలంతో ప్రచురించిన పుస్తకాలను నిషేధించడం. గాంధీజీ నాయకత్వంలో సహాయ నిరాకరణో ద్యమం ముమ్మరంగా సాగుతున్న కాలంలోనే దేశంలోని వివిధ



ప్రాంతాల్లో ఎస్.ఎ.డాంగే, సింగారవేలుశెట్టి, ముజఫర్ అహ్మద్ వంటి వారి నాయకత్వంలో ఉన్న చిన్న చిన్న గ్రూపులను కలుపుకొని 1925 నాటికి కమ్యునిస్టు పార్టీగా అవతరించింది. ఈ ప్రభావం తెలుగు నేల పై బలంగానే పడింది.

ప్రముఖ కాంగ్రెస్ వాది ఉన్నవ లక్ష్మీనారాయణ రాసిన మాలపల్లి నవలలో సైతం రష్యా విప్లవ ప్రస్తావన ప్రముఖంగానే ఉంది. 1932లో జైలుశిక్ష అనుభవిస్తున్న కాంగ్రెసు వాది క్రొవ్విడి లింగరాజు గోర్కీ అమ్మ నవలను చదివి ఉత్తేజితుడై తెలుగులోకి అనువదించారు. దాన్ని 1934లో ఆదర్శగ్రంథమండలి ప్రచురించగా 1935 లో బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. అది మొదలు 1947 వరకు, ఆ మాటకొస్తే ఆ తర్వాత కూడా ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో ఈ నిషేధాల పరంపర కొనసాగింది. ముంగండ గోదావరి జిల్లాలో ఒక చిన్న గ్రామం. ప్రముఖ తెలుగు రచయిత మహీధర రామమోహనరావు సోదరులు స్థాపించిన విశ్వ సాహిత్యమాల ఈ ఊళ్లో ప్రారంభమై దాదాపు 85 పుస్తకాలు ప్రచురించగా అందులో కనీసం అరడజను గ్రంథాలు నిషేధానికి గురయ్యాయి. వాటిల్లో కార్ల్‌మార్క్స్ ఉపదేశాలు, రష్యా విప్లవం, కూలీ, పెట్టుబడి, సోషలిజం వంటి అనువాద గ్రంథాలు 1937-1942 మధ్యకాలంలో నిషేధింపబడ్డాయి. అయినా ఈ పుస్తకాలు వివిధ రవాణా రూపాల్లో ఆంధ్ర రాష్ట్రమంతా విరివిగా పంపిణీ అయ్యాయి. అనువాదకులు మహీధర కృష్ణమోహనరావు ఏడాదిపాటు జైలుశిక్ష అనుభవించారు. ఆదర్శ గ్రంథమండలి స్థాపించి అమ్మ నవలను ప్రచురించిన గద్దె లింగయ్యగారు కమ్యూనిస్టు ప్రణాళిక, లెనిన్ రాసిన సామ్రాజ్యవాదం పుస్తకాలను ప్రచురించగా, అవీ నిషేధింపబడ్డాయి.

1946 జులై 4 న నిజాంకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో ప్రారంభమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భారతదేశ కమ్యూనిస్టు భారతదేశ చరిత్రలోనే ఒక ముఖ్యమైన పోరాటం. ఇది అప్పటి హైదరాబాద్ స్టేట్‌లో 1948 లో నిజాం లొంగిపోయిన అనంతరం కూడా కొనసాగింది. ఈ కాలంలో సుంకర, వాసిరెడ్డి రాసిన ముందడుగు నాటకం 1946 లో నిషేధిస్తే, లక్ష్మీకాంతమోహన్ రాసిన సింహగర్జన నవల 1947 లో నిషేధించారు. బుర్రకథ అనే కళారూపం కూడా ఈ కాలంలోనే నిజాం ప్రభుత్వం తెలంగాణలోను, బ్రిటిష్ ప్రభుత్వం ఆంధ్ర ప్రాంతంలోను నిషేధించాయి. పాయం అనే ఉర్దూ పత్రికను 1946 లో ఆరునెలల పాటు నిషేధిస్తే, నిర్బంధాలు తట్టుకోలేక మీజాన్ పత్రిక మూతపడింది. ఇలా ఈ కాలంలో నిషేధాలన్నీ ప్రధానంగా కమ్యూనిస్టు రచనల పైనే ఎక్కు పెట్టాయి.

మూడవది: మోరల్ గ్రౌండ్‌లో నిషేధం. 1858 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం తరువాత బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశపు మత విషయాలలోను, సాంఘిక ఆచార వ్యవహారాలలోను, నైతిక వ్యవహారాలలోను జోక్యం చేసుకోకూడదని నిర్ణయం తీసుకుంది. ఈ కోణం నుంచి చర్చించ వలసింది ముద్దుపళని రాసిన రాధికా స్వాంతనం కావ్యం గురించి. ముద్దుపళని తంజావూరు ఆస్థానంలో దేవదాసి. ఈ కావ్యాన్ని 1757-1763 మధ్యకాలంలో రాసింది. ఇది ఇళాదేవి, రాధాకృష్ణుల మధ్య నడిచిన శృంగార ప్రధాన కావ్యం. ప్రముఖ సంగీత విద్వాంసురాలు బెంగుళూరు నాగరత్నమ్మ 1910 లో దీనిని సేకరించి, ప్రచురించింది. దీనిలో శృంగారపరమైన అభ్యంతరాలు ఉన్నాయని, ప్రజల నైతిక మనోభావాలు దెబ్బతింటాయని భావించి 1911 లో బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఎంతో ఆధునికవాది, సంస్కరణవాది అయిన కందుకూరి వీరేశలింగం ఈ పుస్తకాన్ని నిషేధించమని కోరటం. వీరేశలింగం చర్యను బెంగుళూరు నాగరత్నమ్మ తీవ్రంగా నిరసించింది. 1947 లో టంగుటూరి ప్రకాశం ముఖ్యమంత్రి అయ్యాక ఈ నిషేధాన్ని ఎత్తేశారు. ఇలాంటిదే మరొక గ్రంథం కడప జిల్లాకు చెందిన చెనికల చెన్నారెడ్డి రాసిన శాంత సారంగధర నాటకం. ఇందులో మితిమీరిన శృంగార, బూతు సన్నివేశాలు ఉన్నాయని దీనిని నిషేధించారు.

ఈ నిషేధాల వివరాలు సమగ్రంగా అంత తేలికగా లభ్యం కావటం లేదు. ఇప్పటికీ గెరాల్డ్ బారియర్ రాసిన బ్యాన్ అనే పుస్తకమే ప్రామాణికంగా ఉంది. ఇందులో సైతం తెలుగుభాషా పుస్తకాలకు సంబంధించిన నిషేధ వివరాలు అతి కొద్దిగా మాత్రమే ఉన్నాయి. సాహిత్యం మీద ఇప్పటికీ నిషేధం కొనసాగుతూనే ఉంది.

సాహితి

శాంతి

-అర్కాలి అబషీడ్జె
అనువాదం: కేశవ్ గోపాల్

"యావత్ప్రపంచానికి శాంతి!
అవసరం ప్రపంచానికి శాంతి!"
1942 లో క్రిమియా సాగించిన
భీకర పోరాటాన్ని క్షణమైనా మరువలేని
ప్రతి హృదయం
నీకిస్తున్న పిలుపిది
విసుర్తున్న సవాలిది.
అగ్ని కీలల్లో
అట్టుడుకుతున్న
నల్ల సముద్రం,
వీర సైనికుల ఛాతీల్లో
రివ్వున నాటుకుంటున్న
బాంబుల రవ్వలు
భస్మీపటలమైన కెర్చ్
ముళ్లతీగల కంచెలు..
కళ్లకు కద్దాయి
సాక్షాత్తూ
ఇప్పుడు జరుగుతున్నట్టుగా
ఆ నిధనాన్ని!

"యావత్ప్రపంచానికి శాంతి!
అవసరం ప్రపంచానికి శాంతి
ఈ గంభీర వాక్కులు
దిక్కులు పిక్కటిల్లుతున్నప్పుడు
మనిషి మనిషికీ మనసులో
గుచ్చుకుంటుంది బాణంలా
యుద్ధకాలం!
మళ్లీ జ్ఞప్తికి వస్తాయి
అప్పటి/బాక్సన్ స్టెప్పీ భూములు
గాయపడ్డ సైనికుల మూలుగులు-
కాళ్ల కింద నలుగుతున్న
నేలతల్లి నిట్టూర్పులు-
నీలాల నింగిని
దగ్ధం చేస్తున్న దావాగ్నులు-
ఒళ్లంతా
అంతే ఆందోళనతో, ఆత్రంతో
జలదరిస్తుంది.
గజగజ వణుకుతుంది
పిరంగులింకా మంటలు చిమ్ముతున్నవని!

"యావత్ప్రపంచానికి శాంతి!
అవసరం ప్రపంచానికి శాంతి!
శత్రువుల్ని నిశ్శేషంగా జయించినా,
తన సాహస కృత్యాలకు మురిసి
జయజయ ధ్వానాలు చేయలేని
అజరామర హృదయాన్ని చీల్చుకుని
వస్తోంది పిలుపు!
కడగళ్ల
గుళ్ల దూసుకొస్తున్నా
దిగుళ్ల గుబుళ్లు కమ్ముకొంటున్నా
హద్దూ పద్దూ లేకుండా
యుద్ధం సాగుతున్నప్పుడు
ఫిరంగుల భాషలో
చిందించిన నెత్తురుతో
శాంతి గీతికలు రచిస్తున్నప్పుడు-
ఈ హృదయంలో
రానున్న తరాలపై పెంచుకున్న
అంతులేని విశ్వాసం
ఇసుమంతైనా తరిగి పోలేదు!
గతంలో బుసకొట్టిన
విష సర్పాలెన్నో
శాంతిని కాటేయలేక
భస్మమయ్యాయి.
ఈ హృదయం/ శాంతిని పరిరక్షించింది.
శాంతి తిరుగులేనిదని
తెలుసు యీహృదికి
ముమ్మాటికీ!
ఇది
శత సహస్ర హృదయాల బృందంగానం-
"శాంతి చెరగదు
శాంతికి చేయూత తరగదు!
మనిషి మనిషికీ శాంతి
ఇంటింటికీ, గుండె గుండెకూ శాంతి!
యావత్ప్రపంచానికి శాంతి!
అవసరం ప్రపంచానికి శాంతి"!

మహనీయుడికి మరువలేని నివాళి !

గ్రంథ సమీక్ష

'చందురుని మించు అందమొలికించు ముద్దు పాపాయివే
నిను కన్నవారింట కష్టముల నీడ కరిగిపోయేనులే ..'

ఈ పాట ప్రతి తెలుగువాడి గుండెల్లో మార్మోగే అపురూప గీతం. అన్నాచెల్లెళ్ల బంధం గొప్పతనాన్ని చాటి చెప్పే ఈ ఉదాత్త చిరస్మరణీయ గీతం 'రక్తసంబంధం' సినిమాలోది. ఇది మన అందరికీ తెలుసు. అన్నాచెల్లెళ్లుగా ఎన్టీఆర్ - సావిత్రి తమ పాత్రలకు ప్రాణ ప్రతిష్ఠ చేసారని కూడా మనకు తెలుసు.

కానీ ఈ పాట ఎవరు రాశారో ఎవరికీ తెలీదు. మామూలు సాధారణ ప్రజలకే కాదు. పెద్ద చదువులు చదివిన వారికి, సారస్వత రంగంలో ఉన్నవారికి కూడా తెలియదు. ఇదే మన తెలుగునాట రచయితల దౌర్భాగ్యం. 'క్రాంతదర్శి' అనిపించుకున్న కవి/ రచయిత ఎప్పుడూ 'తెర వెనకే' మిగిలిపోతాడు. ముఖ్యంగా సినిమా రంగంలో కవి/ రచయితది ఎప్పుడూ వెనుక బెంచీనే!

ఈ పాట విషయానికి వస్తే ఇది అనిసెట్టి సుబ్బారావు గారి రచన. సుశిక్షిత అక్షర కార్మికుడైన అనిసెట్టి సరిగ్గా నూరేళ్ల క్రితం గుంటూరు జిల్లా నరసరావుపేటలో జన్మించారు. కలం వీరుడైన అనిసెట్టి ఆదినుంచి తాడిత పీడిత జనుల పక్షపాతే! అభ్యుదయపథ వాదే!!

కేవలం సినిమా గీతాలే కాదు ప్రగతిశీల రచనలెన్నింటినీ చేశారాయన. వామపక్ష భావజాలంతో దినదిన ప్రవర్ధమానం అవుతూ ప్రజా చైతన్యానికి అవిరళ కృషి చేశారు. సాధారణంగా ఒకప్పటి సినీ ప్రియులకు అనిశెట్టి, పినిశెట్టి పేర్లు తరచు వినబడుతూ ఉండేవి. వారిలోని అనిశెట్టి గురించే మనం ప్రస్తుతం చెప్పుకునేది. ఆయన ఎన్నో చిరస్మరణీయ సినీ గీతాలు, అభ్యుదయ కథలు, నాటకాలు, రేడియో నాటకాలు మాత్రమే కాక చాలా సినిమాలకు సంభాషణ రచయితగా పని చేశారు. తన నాటకాలలో అనేక ప్రయోగాలు చేశారాయన. 'గాలి మేడలు' నాటకంలో రంగస్థలం మీది పాత్రలు ముందు కూర్చున్న ప్రేక్షకులతో సంభాషణలు జరపడం అప్పట్లో ఒక కొత్త వరవడి. ఇలాంటి ప్రయోగాలను ఆయన పాశ్చాత్య నాటకాల నుంచి స్వీకరించారు. అడుగడుగున కొత్తదనం కోసం తహతహలాడే అనిసెట్టి తన రచనలలో వాటిని ప్రవేశపెట్టి సమకాలీన రచయితలలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్నారు

ఆయన నాటకాలు, కథలలో - సమాజంలోని స్వార్థాన్నిఎండగడుతూ సామాన్యుడిని ప్రగతి మార్గంలో నడిపించడానికి అవిరళ కృషి చేశారు. సాంఘిక సాహిత్య ఉద్యమాల్లో ఆయన పోషించిన పాత్ర అవిస్మరణీయమైంది. అనిసెట్టి రచనలు అనేకం ఇతర భాషలలోకి కూడా అనువాదమై ఆయనకు ఎనలేని కీర్తిని సంపాదించి పెట్టాయి. మహాకవి శ్రీశ్రీ లాగే పౌరాణిక ప్రతీకలను తన కవిత్వంలో అక్కడక్కడా వాడడం అనిసెట్టికి కూడా అలవాటే.

అనిసెట్టి కవితా పంక్తులు ఎంత పదునుగా ఉంటాయో చూడండి..
భరత దేశమే పతనమాయెనా/ కరకు గుండెగా మారిపోయెనా?
మళ్ళీ ఈ ఉదాత్తత చూడండి..
అవనిలోన ఒక అనాథ ఉన్నా/ మానావాళికవమానం కాదా !

ఈ ఆశావహ దృక్పథం చూడండి.. ఆశ సుమించే ఆత్మ సుఖించే/ ఆ మహోదయం రాదా!

ఏది ఏమైనా అనిసెట్టి లాంటి అక్షరవీరుల్ని ఈ తరం చదవాలి. ఇప్పటికీ ఎంతో నవ్యతతో తళతళలాడే ఆ వ్యక్తీకరణలను ఆపోశన పట్టాలి. హృదయంలో ప్రతిష్ఠించుకోవాలి.

'అనిసెట్టి సాహిత్యానుశీలనం' పేరుతో డాక్టర్ పి వి సుబ్బారావు గారు కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్డీ పట్టా పొందిన సిద్ధాంత గ్రంథానికి ఇది మలి ముద్రణ. తొలి ముద్రణలో లేని అనిసెట్టి డబ్బింగ్ పాటలు, ఇంకా ఇతరత్రా విశేషాలు ఈ శత జయంతి ముద్రణలో చేర్చారు. అనిసెట్టి గీతాల్లో మాత్రా ఛందస్సుల నడకను కూడా రచయిత ఇందులో వివరంగా విప్పిచెప్పారు. సిద్ధాంత గ్రంథ రచయిత సుబ్బారావు గారి గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. అనిసెట్టికి సంబంధించిన సమాచారాన్ని సేకరించడానికి, క్రోడీకరించడానికి వారెంత శ్రమదమాదులకు ఓర్చారో ఒక్కసారి వారు ఇచ్చిన 'ఉపయుక్త గ్రంథ సూచీ'ని చూస్తే చాలు ఇట్టే అర్థం అవుతుంది. వారి కృషి ముందు తరాలకు దిక్సూచి.

కనుకనే సుబ్బారావు ధన్యులు.. మూర్ధన్యులు!!

-చంద్ర ప్రతాప్ కంతేటి, 80081 43507



అనిసెట్టి సాహిత్యానుశీలనం (శతజయంతి ప్రచురణ)
- డా. పి. వి. సుబ్బారావు,
పేజీలు 285, వెల. రూ. 300/-
ప్రతులకు : విశాలాంధ్ర, నవచేతన, ప్రజాశక్తి బుక్ హౌస్ బ్రాంచీలు,
రచయిత-98491 77594)

'మనిషి గుర్తుల్ని బతికించుకుందాం' పుస్తకావిష్కరణ సభ

చందలూరి నారాయణరావు రాసిన కవితా సంపుటి 'మనిషి గుర్తుల్ని బతికించుకుందాం...' పుస్తకావిష్కరణ సభ సెప్టెంబర్ 4వ తేదీ ఆదివారం సాయంత్రం 5గం.లకు ఒంగోలులోని యం.టి.ఆర్ కళాక్షేత్రంలో జరుగుతుంది. పుస్తక స్వీకర్తగా మండలి బుద్ధప్రసాద్, ఆవిష్కర్తగా విరవు బాలసుబ్రహ్మణ్యం, సమీక్షకులుగా అన్నమనేని వెంకట్రావు, జంధ్యాల రఘుబాబు.

బీరం సుందరరావు, తేళ్ల అరుణ, ఎన్. సి.హెచ్ చక్రవర్తి, పాలపర్తి హావీలా, సాగర్ శ్రీరామకవచం, ఆర్.వి.రాఘవరావు, డి. వి.యం.సత్యనారాయణ తదితరులు పాల్గొంటారు.

- సాహితి స్రవంతి, ప్రకాశం జిల్లా

వ్యవహారికభాషకు ఆద్యుడు గిడుగు

గ్రాంధిక భాష మార్గం మార్చి, వాడుక భాషకు ప్రాణం పోసిన మేరునగధీరుడు గిడుగు రామమూర్తి పంతులు. "కావ్య భాష వద్దు . వ్యవహారిక భాష ముద్దు" అనే నినాదంతో ఉద్యమం చేపట్టి తెలుగు సాహిత్యంలో చారిత్రాత్మక మార్పుకు శ్రీకారం చుట్టారు. 1911లో మొదలైన ఈ వ్యవహారిక భాషా ఉద్యమం సుమారు ఆరు దశాబ్దాల పాటు, ఆయన మరణించినా అనేక మంది కవులు, కళాకారులు, రచయితలు, పాత్రికేయులు తమ భుజాలపై మోసి చివరకు 1973లో తమ లక్ష్యాన్ని చేరుకున్నారు. వ్యవహారిక భాషగా తెలుగు అటు పరిపాలనలో ఇటు విద్యాపరంగా పరిపుష్టం అయ్యింది. ప్రపంచ వ్యాప్తంగా 6000 భాషలు ఉండగా, దాదాపు 3000 భాషలు మృత స్థితిలో ఉండగా, 9.2కోట్లమంది మాట్లాడే మన తెలుగుభాష కూడ 2030 నాటికి చితికి శల్యంఅయ్యే స్థితికి చేరుకుంటుంది అని సాక్షాత్తూ ఐక్యరాజ్యసమితి ప్రకటించుట తెలుగు ప్రజల, భాషాభిమానుల హృదయం కకావికలం అవుతుంది. దీనికి ప్రధాన కారణం ప్రపంచీకరణ నేపథ్యంలో ఆంగ్ల భాష అంతర్జాతీయ భాషగా అవతరించి, తెలుగు ప్రజలు ఆ వ్యామోహంలో చిక్కుకుని, ఆంగ్లాన్ని అనుసరించుటకు సిద్ధ పడుటయే.

"నిలుచుటకు చోటు ఇస్తే - ఇల్లే నాది అన్నట్లు" నానుడిలా, ఉపాధి కోసం నేర్చుకున్న ఆంగ్లం ఇప్పుడు సర్వస్వం తానై మన జీవితాన్ని, స్థానికతను లాగేసుకుని, చివరికి మాతృభాషను కాలసర్పంలా మింగేస్తుంది. ఏ జాతి ప్రజల ప్రగతికైనా మాతృభాషే పునాది. అటువంటి కోవకు చెందినదే మన తెలుగు ప్రాచీన భాష. శాతవాహనుల కాలంలో జనించి, మధ్యయుగ కాలంలో ప్రరిఢవిల్లి, "దేశ భాషలందు తెలుగు లెస్స" అన్న కీర్తి గడించిన తెలుగు నేటికాలంలో అవసాన దశలో ఉండుట అత్యంత బాధాకరమైన విషయం. మన పొరుగు రాష్ట్రాలు వారి మాతృభాషలకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ, ఇతర భాషలకు తరువాతి స్థానం కల్పిస్తూ ముందుకు సాగుతూ ఉండగా, మన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఆంగ్లంలోనే అభివృద్ధి అనే భావనతో సాగుతున్నారు. "సైకో లింగ్విస్టిక్స్" సిద్ధాంతం ప్రకారం తల్లిదండ్రులు మాట్లాడే భాషను బట్టే, వారి పిల్లలు భాషలో పరిపక్వత చెందుతారు అని తెలిపారు. అంతేకాకుండా 2020 జాతీయ విద్యా విధానం (యన్.ఇ.పి) కూడా ప్రాధమిక విద్య మాతృభాషలో ఉండాల్సిన అవసరం ఉంది అని తెలిపింది.

1863, ఆగష్టు 29న జన్మించిన గిడుగు రామమూర్తి పంతులు గిరిజన ప్రాంతాల్లో ఉపాధ్యాయ వృత్తి చేపట్టి, అక్కడ ప్రజలు ముఖ్యంగా "సవరలు" మాట్లాడే భాష, పుస్తకాల్లో ఉన్న భాష అర్థంకాక వారిపడే ఇబ్బందులు దృష్టిలో వుంచుకుని, ఈయనే స్వయంగా సవర భాష నేర్చుకుని, లిపి, వ్యాకరణం, నిఘంటువు తయారు చేసి అక్కడ ప్రజలు అభిమానంతో పాటు ఆనాటి బ్రిటిష్ వారి ఆదరణ పొందాడు. ఈయన పరిశోధనలకు, కృషికి బ్రిటిష్ వారు 1913లో "రావు సాహెబ్", 1934లో "కైజర్ హింద్" బిరుదులతో సత్కరించారు. అయితే అక్కడితో ఆగకుండా పుస్తకాలలో ఉన్న భాష పండితులకే అర్థంకాని గ్రాంధిక భాష స్థానే, సామాన్య ప్రజలు మాట్లాడే వాడుకభాష ప్రవేశపెట్టేందుకు "వ్యవహారిక భాషా ఉద్యమం" చేపట్టి, ఆనాటి తెలుగు భాషా ఉద్దండుల సహకారంతో వ్యవహారిక భాషా ఉద్యమాన్ని ముందుకు తీసుకుని వెళ్ళారు. "తెలుగు" పత్రిక స్థాపించి చైతన్య పరిచాడు. రాజమహేంద్రవరంలో "వర్ధమానాంధ్ర భాషా ప్రవర్తక సంఘం" స్థాపించి ఇక్కడ, తణుకు పలుచోట్ల సమావేశాలు నిర్వహించి వాడుక భాష ఆవశ్యకత తెలియజేశారు. ఆ కృషి ఫలితమే "శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం" లో పరిశోధనలు తెలుగులో చేయుటకు, "ఆంధ్ర విశ్వవిద్యాలయం"లో పరీక్షలు రాసేందుకు వీలు ఏర్పడింది.



1924లో కాకినాడలోని ఆంధ్ర సాహిత్య పరిషత్తు అధికారికంగా, వ్యవహారిక భాష వాడకంపై ఉన్న నిషేధం ఎత్తివేసింది. తెలుగు మన జీవనం, భావనం కావాలని భావించి, ఆధునీకరణకు ఆలోచన చేసిన భాషా భగీరథుడు పిడుగు గిడుగు రామమూర్తి పంతులు. గ్రాంధిక భాష నుండి వాడుక భాషలో తెలుగు సాహిత్య చరిత్రను మలుపు తిప్పి, ఎన్నో పత్రికలు తెలుగునాట ఆవిర్భవించుటకు, ఎంతో మంది అక్షరాస్యత సాధించుటకు, ఎందరో కవులు, కళాకారులు, రచయితలు అభివృద్ధి చెందుటకు కారణమైన గిడుగు రామమూర్తి జయంతినే మనం "తెలుగు భాషా దినోత్సవం"గా జరుపుకొనుట సమంజసమే కదా.!.

పదహారణాల తెలుగుతనంతో, తెలుగు భాషలో విజ్ఞానం సంపాదించి, పరభాషలో ప్రావీణ్యం సాధిస్తూ నేటితరం కదలాలి. ఎక్కడ ఉన్నా మన తెలుగు భాషను మరువరాదు. ప్రపంచ భాషల్లో నేడు తెలుగు 16వ భాషగా, దేశంలో 4వ భాషగా వర్ధిల్లుతున్నది. అయితే నేటి గణాంకాలు ప్రకారం కేవలం 27శాతం మాత్రమే తెలుగు మాధ్యమంలో చదువుట బాధగా ఉంది. "గ్రాంథికము నెత్తిన పిడుగు గిడుగు.. వ్యవహారిక భాషోద్యమ స్థాపన ఘనుడు గిడుగు...తేట తేనీయుల తెల్లని పాల మీగడ గిడుగు...కూరి తెలుగు భాషకు గొడుగు గిడుగు" అన్న పులిదిండు మహేశ్వర్ మాటలు , "రామ్మూర్తి పంతులు తెలుగు సరస్వతి నోముల పంట" అన్న విశ్వనాథ సత్యనారాయణ మాటలు యదార్థమే కదా...! తెలుగుభాషను కాపాడుకోవడమే గిడుగు రామమూర్తికి మనం ఇచ్చే ఘన నివాళి.

(ఆగస్టు 29వ తేదీ గిడుగు రామమూర్తి పంతులు జయంతి)

వ్యాస రచయిత ఐ.పి.రావు, సెల్: 9948272919.

మోదీ ఫాసిస్టు విధానాలపై పోరు

- దళితుడైనందునే రాష్ట్రపతికి అవమానం
- సీపీఐ రాష్ట్ర మహాసభలో అనీ రాజా

విశాలాంధ్ర బ్యూరో– విశాఖపట్నం:
మోదీ సర్కారు ఫాసిస్టు విధానాలపై అలుపెరుగని పోరాటం చేయాలని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) ప్రధాన కార్యదర్శి డి.అనీ రాజా పిలుపునిచ్చారు. లౌకిక, ప్రజాస్వామిక, రాజ్యాంగబద్ధ భారతదేశంలో స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీ ఒక ప్రభుత్వ కార్యక్రమంలో పూజారులతో కార్యక్రమం నిర్వహించడం అత్యంత దారుణం, బాధాకరమని ఆమె అన్నారు. సీపీఐ రాష్ట్ర 27వమహాసభల సందర్భంగా ఆదివారం ప్రతినిధుల సభలో అనీ రాజా ప్రసంగించారు. పార్లమెంటు నూతన భవనం వద్ద భారత ప్రభుత్వ చిహ్నం ఆవిష్కరణ సందర్భంగా మోదీ స్వయంగా పూజారులతో కార్యక్రమం నిర్వహించారని, ఆశ్చర్యకరంగా ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ హాజరైనప్పటికీ ఆయనను మాత్రం దూరంగానే ఉంచారన్నారు. కేవలం దళితుడైనందునే ఆయనకు చోటు కల్పించలేదని విమర్శించారు. మోదీ ఫాసిస్టు విధానానికి ఇదొక నిదర్శనమని అనీరాజా పేర్కొన్నారు. ఆరెస్సెస్, బీజేపీ వంటి మతోన్మాద, ఫాసిస్టు శక్తులపై పోరాటానికి మనం రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం కావాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. మోదీ సర్కారు పార్లమెంటును, కేంద్ర దర్యాప్తు సంస్థలను, న్యాయవ్యవస్థను దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. ఈ పరిణామాలన్నింటినీ గమనిస్తే మోదీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలు అమలు చేస్తున్నట్లు ప్రతి ఒక్కరికీ అర్థమవుతోందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకుంటున్న భారత్‌లో ఒక ప్రధాని ఇంత నిర్లజ్జగా మత కార్యక్రమం నిర్వహించటం శోచనీయమన్నారు. ఇక్కడ ఆశ్చర్యమేమిటంటే ఇదేదో స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే వేడుకల్లాగా ఈ మొత్తం కార్యక్రమాన్ని టీవీ ఛానళ్లు ప్రత్యక్ష ప్రసారం చేయగా, ప్రింట్ మీడియా పెద్దఎత్తున కథనాలు ప్రచురించిందని తెలిపారు. రోజురోజుకూ దేశంలోని పరిణామాలు క్లిష్టంగా మారుతున్నాయని, వీటిని అధిగమించడానికి యువత, మహిళలు మరింత ముందుకు రావాలని అనీ రాజా పిలుపునిచ్చారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పతకాలు సాధించిన మన కమ్యూనిస్టు బిడ్డ కుమారి నందాను అనీ రాజా అభినందించారు. కామన్‌వెల్త్ వంటి ఉన్నతస్థాయి క్రీడలకు ఎదగటానికి నందాకు మనం అండగా నిలవాలని సూచించారు. ఇటీవల జరిగిన కామన్‌వెల్త్ క్రీడల్లో మీరా భాను భారత్ గర్వించదగిన విధంగా బంగారు పతకం సాధించారని కొనియాడారు. ఆమె కూడా మన కమ్యూనిస్టుపార్టీ కుటుంబానికి చెందినదేనని, మీరా భాను తల్లి మణిపూర్‌లో ఎన్ఎఫ్ఐడబ్ల్యు నాయకురాలని గుర్తు చేశారు. రాష్ట్ర మహాసభలను ప్రస్తావిస్తూ ప్రతినిధులుగా ఎక్కువమంది మహిళలుండటం సంతోషంగా ఉందని, రానున్న మహాసభల నాటికి ఈ సంఖ్య మరింత పెరగాలని ఆమె ఆకాంక్షించారు. మహిళలు రాజకీయంగా, సైద్ధాంతికంగా మరింత పటిష్టవంతం కావాలని సూచించారు.

యడ్ల చేతన్‌కు 5 వేల నగదు బహుమతి

సీపీఐ జాతీయ మహాసభల లోగోను అందంగా, ఆకర్షణీయంగా రూపొందించిన యడ్ల చేతన్‌కు రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం రూ.5వేల ప్రోత్సాహక బహుమతిని అందజేసింది. చేతన్ అందుబాటులో లేకపోవడంతో ఈ మొత్తాన్ని సీపీఐ రాష్ట్ర నాయకులు వై.చెంచయ్యకు రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అందజేశారు.

కుమారి నందాకు సన్మానం

రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పతకాలు సాధించిన వెయిట్ లిఫ్టర్ కుమారి నందాను అనీ రాజా ఘనంగా సత్కరించారు. ఆమెను శాలువతో సత్కరించి, రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం ప్రకటించిన 10వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా నేతలు అక్కినేని వనజ, వి.జయలక్ష్మి, పి.దుర్గాభవాని, విమల, లలిత తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ మహాసభలకు

ఆహ్వాన సంఘం రూ.8 లక్షల విరాళం

విశాలాంధ్ర –విశాఖ:
విజయవాడ నగరంలో అక్టోబరు 14 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న సీపీఐ జాతీయ మహాసభల విజయవంతానికి సీపీఐ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం రూ.8 లక్షల విరాళం అందజేసింది. ఈ మొత్తాన్ని ఆహ్వానసంఘం అధ్యక్షుడు మానం ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి జేవీ సత్యనారాయణ మూర్తి, కోశాధికారి ఎం.పైడిరాజు, పార్టీ నాయకులు ఏజే స్టాలిన్, ఎ.విమల, అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, అల్లూరి జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా చేతుల మీదుగా రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, కార్యవర్గసభ్యులు అనీరాజా, రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు. ఆహ్వానసంఘ సభ్యులకు సీపీఐ నేతలు అభినందనలు తెలిపారు.

వ్యవసాయ కార్మిక సంఘం రూ.50 వేల విరాళం

విశాలాంధ్ర బ్యూరో– విశాఖపట్నం:
సీపీఐ జాతీయ మహాసభలు జయప్రదానికి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మొదటి విడతగా రూ.50వేల విరాళాన్ని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి కె.నారాయణకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు బండి వెంకటేశ్వరరావు ఆర్.వెంకట్రావు బి.కేశవరెడ్డి చాపర సుందర్‌లాల్, సి.సుబ్రహ్మణ్యం, పి.పెంచలయ్య, కాబోతు ఈశ్వరరావు అందజేశారు.

విద్యుత్ ఉద్యమ అమరవీరులకు నివాళులు

విశాలాంధ్ర బ్యూరో–విశాఖపట్నం:
విద్యుత్ ఉద్యమంలో అమరులైన కామ్రేడ్లకు సీపీఐ రాష్ట్ర మహాసభ నివాళులర్పించింది. విశాఖపట్నంలో కొల్లి నాగేశ్వరరావు సభా ప్రాంగణంలో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర 27వ మహాసభల్లో ఆదివారం ప్రతినిధుల సభలో విద్యుత్ అమరవీరులకు పార్టీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, కార్యవర్గ సభ్యులు డి.అనీ రాజా, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణ మూర్తి, కంట్రోల్ కమిషన్ చైర్మన్ నెక్కంటి సుబ్బారావు, కార్యదర్శి వర్గ సభ్యులు రావుల వెంకయ్య, జల్లి విల్సన్, జి.ఓబులేసు, జి.ఈశ్వరయ్య, పి.హరినాథ రెడ్డి, అక్కినేని వనజ, కార్యవర్గసభ్యులు నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి కళాకారులు చంద్రానాయక్, పెంచలయ్య, నజీర్ బృందం విద్యుత్ అమర వీరుల త్యాగాలను స్మరిస్తూ విప్లవ గేయాన్ని ఆలపించింది.

పంపుసెట్లకు విద్యుత్ మీటర్లు బిగించవద్దు

విశాలాంధ్ర బ్యూరో–విశాఖపట్నం:
వ్యవసాయ పంపు సెట్లకు విద్యుత్ మీటర్లు బిగించాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సీపీఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఐ కడప జిల్లా కార్యదర్శి జి.చంద్ర ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సీపీఐ రాష్ట్ర మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. కేంద్రం ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ చట్ట సవరణ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించింది. కేంద్రం నిర్ణయాలకు రాష్ట్ర ప్రభుత్వం తలొంచడాన్ని తప్పుబట్టింది. విద్యుత్ మీటర్ల బిగింపుతో రైతులకు అన్యాయం చేయవద్దని డిమాండ్ చేసింది.

పేదలకు సాగు భూములు

నవరత్నాల్లో చేర్చాలి

- కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు అమలు చేయాలి
- సీపీఐ రాష్ట్ర మహాసభలో జల్లి విల్సన్ ప్రవేశపెట్టిన తీర్మానం ఆమోదం

విశాలాంధ్ర బ్యూరో– విశాఖపట్నం:
కోనేరు రంగారావు భూ కమిటీ చేసిన సిఫార్సులలో ప్రభుత్వం ఆమోదించిన వాటిని వెంటనే అమలు చేయాలని, పేదలకు సాగు భూముల అంశాన్ని నవరత్నాల్లో చేర్చాలని విశాఖలో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర 27వ మహాసభ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ప్రతినిధుల సభలో సీపీఐ రాష్ట్రకార్యదర్శివర్గసభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ తీర్మానాన్ని ప్రవేశపెట్టి సమస్యపై మాట్లాడారు. రాష్ట్రంలో సెంటు భూమి లేని నిరుపేదలకు భూ పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావడం లేదు. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో కమ్యూనిస్టులు, వ్యవసాయ కార్మిక సంఘాలు కల్సి ప్రత్యక్ష భూ పోరాటాలు చేసిన ఫలితంగా సలహాలు, నిర్దిష్ట సూచనలు, సంప్రదింపులు చేయడం ద్వారా ఆయన మంత్రివర్గంలో సహచరులైన కోనేరు రంగారావు అధ్వర్యంలో సీనియర్ ఐఏఎస్ అధికారులతో భూ కమిటీ ఏర్పాటు చేశారు. ఆ కమిటీ కమ్యూనిస్టులు చెప్పింది వాస్తవమని గ్రహించి, సమగ్ర నివేదికలో 104 సిఫార్సులు చేసింది. ఆ సిఫార్సులలో వైఎస్సార్ ప్రభుత్వం 92 ఆమోదించింది. అయినప్పటికీ రాష్ట్రంలో ఏ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా భూమిలేని నిరుపేదలకు సాగు భూములు ఇవ్వడం లేదు. గత రాష్ట్ర ప్రభుత్వం 9/77 అసైన్డ్ చట్టంలో సెక్షన్ 3ను సవరిస్తూ తీర్మానం చేసింది. దీనిని ఆసరా చేసుకుని ప్రస్తుత ప్రభుత్వం సర్కారు ద్వారా పొందిన భూములను 10 సంవత్సరాల తర్వాత అమ్ముకోవచ్చని సవరణ చేసింది. ఈ సవరణ అమల్లోకి రావడం వల్ల దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల చేతుల్లో ఉన్న సాగు భూములు ఇక మిగలవు. చట్టం అమల్లో ఉండగానే పేదల చేతుల్లో ఉన్న అసైన్డ్ భూములు పెద్ద ఎత్తున అనర్హుల చేతుల్లోకి వెళుతున్నాయి. రాష్ట్రంలో లక్షలాది ఎకరాల భూములు పెత్తందారులు, పలుకుబడి కల్గిన పెద్దలు అక్రమంగా, దౌర్జన్యంగా అనుభవిస్తున్నా ప్రభుత్వాలు వారి జోలికి వెళ్లడం లేదు. ఇకనైనా ప్రభుత్వం తక్షణమే కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులపై దృష్టిపెట్టాలని విల్సన్ కోరారు. తండ్రి పేరు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్ రెడ్డి తన ప్రప్రథమ ప్రాధాన్యతగా ఇస్తున్న నవరత్నాల్లో భూకమిటీ నివేదికను చేర్చి అమలు చేయాలని కోరారు. ఇప్పటికే పేదల అనుభవంలో ఉన్న సాగు, నివాస భూములకు పూర్తి హక్కులతో పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

ప్రభుత్వరంగ సంస్థల

ప్రైవేటీకరణ వద్దు

- పీజే చంద్రశేఖరరావు
- సీపీఐ రాష్ట్ర మహాసభలో తీర్మానం ఆమోదం

విశాలాంధ్ర బ్యూరో–విశాఖపట్నం:
కేంద్రంలోని మోదీ సర్కారు విచ్చలవిడిగా కొనసాగిస్తున్న ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను సీపీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ చర్యలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేసింది. ఈ మేరకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పీజే చంద్రశేఖరరావు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని రాష్ట్రమహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. నష్టాల పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను పెట్టుబడిదారులకు కారుచౌకగా విక్రయించడాన్ని సీపీఐ తప్పుపట్టింది. ఇదంతా ప్రపంచబ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థ, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థల ఒత్తిడి కారణంగానేనని పేర్కొంది. ఆర్థిక వ్యవస్థకు సమతుల్యాభివృద్ధికి, సామాజిక న్యాయానికి పట్టుగొమ్మలుగా ఉన్న లాభాలార్జిస్తున్న నవరత్నాల కంపెనీలతో పాటు బ్యాంకులు, బీమా, చమురు, గ్యాస్, రైల్వే, చివరకు రక్షణ రంగాన్ని సైతం వదలకుండా బడా కార్పొరేట్ శక్తులకు కారుచౌకగా అప్పగించే దుర్మార్గ చర్యకు మోదీ సర్కారు పాల్పడుతోందని ఆ తీర్మానంలో పీజే చంద్రశేఖర్ విమర్శించారు. 32 మంది ప్రాణ త్యాగాలతో విద్యార్థి, యువజన, భారత కమ్యూనిస్టు పార్టీ జరిపిన మహత్తర పోరాటాల ఫలితంగా సాధించుకున్న...లక్ష కుటుంబాలకు జీవనోపాధిని కల్పించిన విశాఖ ఉక్కును సైతం ముక్కలు ముక్కలుగా చేసి, విదేశీ, స్వదేశీ గుత్త సంస్థలకు అప్పగించే కుతంత్రాలకు కేంద్ర ప్రభుత్వం బరితెగించిందని తీర్మానం పేర్కొంది. దీని రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ముందుండి నాయకత్వం వహించకపోగా శల్యసారథ్యం వహించి...ఆంధ్ర ప్రజల ఆకాంక్షలపై నీళ్లు జల్లుతున్నదని విమర్శించింది. 680 రోజులుగా అలుపెరుగకుండా పోరాడుతున్న కార్మిక శ్రేణులకు విప్లవ జేజేలు పలికింది. ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణ కారణంగా ప్రజల జీవితాలు దుర్భరంగా మారుతున్న క్రమంలో కార్మిక, ప్రజా సంఘాల పోరాటాలలో క్రియాశీలక పాత్ర పోషించాలని మహాసభ తీర్మానించింది.

మీడియాపై దాడి గర్హనీయం

రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై సీపీఐ రాష్ట్ర మహాసభ తీర్మానం

విశాలాంధ్ర బ్యూరో– విశాఖపట్నం:
రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో మీడియా స్వతంత్రతకు, భావ ప్రకటనా స్వేచ్ఛకు గల స్థానం నానాటికీ కుంచించుకుపోవడంపై సీపీఐ రాష్ట్ర మహాసభ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. జర్నలిస్టు సమస్యల పరిష్కారం కోసం సాగుతున్న వర్కింగ్ జర్నలిస్టుల ఉద్యమానికి మహాసభ సంఘీభావాన్ని, మద్దతును ప్రకటించింది. విశాఖలో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర 27వ మహాసభల్లో ఆదివారం ప్రోగ్రెసివ్ ఫోరం రాష్ట్ర సహాయ కార్యదర్శి క్షేత్రపాల్‌రెడ్డి ఈ అంశంపై తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రాష్ట్రంలో మీడియా స్వేచ్ఛను బలహీనపర్చడానికి, దాడి చేయడానికి జగన్ ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. ప్రభుత్వ విధానాలను విమర్శించే, భిన్నాభిప్రాయాలు గల మీడియా సంస్థలను అసభ్య పదజాలంతో దూషించడం, నిందించడం చేస్తున్నారని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో ప్రభుత్వ విధానాలపై విమర్శలు, వ్యాఖ్యలు చేసే వారిపై పోలీసులు కేసులు పెట్టి వేధించడం నిత్యకృత్యంగా మారిందని తెలిపారు. తమ సొంత పత్రికకు, చానల్‌కు అత్యధిక శాతం ప్రభుత్వ ప్రకటనలు జారీ చేసుకోవడం, ఇతర మీడియా సంస్థలకు ప్రకటనలు ఇవ్వకుండా ఆర్థికంగా దెబ్బతీసే ప్రయత్నం చేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వ వైఖరి మరీ ఘోరంగా ఉందనీ, అక్రిడిటేషన్ల జారీ, హెల్త్ కార్డులు, ప్రమాద బీమా, సంక్షేమనిధి, ప్రెస్ అకాడమీ పాలకవర్గ నియామకం, వివిధ కమిటీల ఏర్పాటు వంటి అనేక సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తోందని తెలిపారు. చివరకు కరోనాతో మరణించిన పాత్రికేయ కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం చెల్లించడానికి జీవో ఇచ్చి కూడా అమలు చేయడం లేదన్నారు. ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించడం లేదనీ, జర్నలిస్టు వ్యతిరేక ధోరణిని ఇకనైనా విడనాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మహాసభ డిమాండ్ చేసింది.

సీపీఎస్ రద్దు చేయాల్సిందే

- 'సీఎం ఇంటి ముట్టడి'కి సీపీఐ మద్దతు
- రాష్ట్ర మహాసభలో ఓబులేసు తీర్మానం

విశాలాంధ్ర బ్యూరో–విశాఖపట్నం:
సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబరు 1వ తేదీన ఉపాధ్యాయసంఘాలు చేపట్టిన 'ముఖ్యమంత్రి ఇంటి ముట్టడి' నిరసన కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర మహాసభ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సీపీఐ రాష్ట్ర మహాసభలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ఆదివారం తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. రాష్ట్రంలో దాదాపు రెండు లక్షల మంది ఉద్యోగులు సీపీఎస్ పథకం వర్తింపు క్రింద పనిచేస్తున్నారు. తాను అధికారంలోకి వస్తే సీపీఎస్‌ను రద్దు చేస్తానని వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్రలోనూ, ఎన్నికల ప్రచారంలోనూ హామీ ఇచ్చారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తానని నమ్మబలికారు. మూడేళ్లు దాటినా ఇచ్చిన హామీని అమలు చేయకుండా జీపీఎస్ అంటూ నాటకాలు మొదలు పెట్టారు. గత ఫిబ్రవరిలో 11వ పీఆర్సీ కోసం ఉద్యోగులు ఉద్యమించినప్పుడు వారిని విజయవాడకు రాకుండా నిర్బంధకాండ చేపట్టారు. ఇప్పుడు సెప్టెంబరు 1వ తేదీన సీఎం ఇంటి ముట్టడి కార్యక్రమాన్ని విఫలం చేయటానికి ప్రభుత్వం నీచానికి ఒడిగట్టింది. విజయవాడకు పోతే రూ.2 లక్షలు జరిమానా అంటూ ఉద్యోగులకు నోటీసులు ఇచ్చారు. ఉద్యోగుల సొంత వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకొని స్టేషన్‌లో ఉంచుకున్నారు. పాఠశాలలో పాఠాలు బోధించే ఉపాధ్యాయుల దగ్గర, వారి ఇళ్ల దగ్గర పోలీస్ కాపలా పెట్టి విద్యార్థులను, ఉపాధ్యాయులను మానసిక క్షోభకు గురిచేస్తున్నారు.

అణచివేత ఉన్న ప్రతిచోట ప్రతిఘటన ఉండి తీరుతుంది. ఇది చరిత్ర నిరూపించిన వాస్తవం. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటికైనా తప్పు తెలుసుకొని సెప్టెంబరు 1న ఆందోళనకు అనుమతించాలని సీపీఐ మహాసభ డిమాండ్ చేసింది.

పోలవరం నిర్వాసితుల సమస్యను పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో– విశాఖపట్నం:
పోలవరం నిర్వాసితుల సమస్య తక్షణ పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేగా ప్రభాకర్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సీపీఐ రాష్ట్ర 27వ మహాసభ ఆమోదించింది. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని, పూర్తి ప్యాకేజీ అందజేసి, బాధితులను పునరావాస ప్రాంతాలకు తరలించాలని, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రూ.6.30 లక్షలను రూ.10లక్షలకు పెంచుతానని ఇచ్చిన హామీని సీఎం జగన్ నిలబెట్టుకోవాలని, ముంపు మండలాల్లోని పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, పునరావాస కాలనీల్లో ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని మహాసభ డిమాండ్ చేసింది. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో పనిచేసే సిబ్బందిని క్రమబద్ధీకరించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నేత లలిత తీర్మానం ప్రవేశపెట్టారు. సాహిత్య, సాంస్కృతిక రంగాలపై దాడులు చేస్తూ కవులు, రచయితలు, మేధావులపై దాడులు చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ తీర్మానం ప్రవేశపెట్టారు. విరసం నేత వరవరరావుకు తక్షణమే షరతులు లేని బెయిల్ మంజూరు చేయాలని, ఆయనపై నమోదు చేసిన అక్రమ కేసును ఎత్తివేయాలని మహాసభ డిమాండ్ చేసింది.

వైద్య సేవలు ప్రభుత్వ నియంత్రణలో ఉండాలి

విశాలాంధ్ర బ్యూరో– విశాఖపట్నం:
ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య సేవలన్నీ ప్రభుత్వ నియంత్రణలో ఉండాలని సీపీఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు డాక్టర్ సుజాత ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సీపీఐ రాష్ట్ర మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆ తీర్మానం ఇలావుంది. ప్రస్తుతం వైద్యం అతి ఖరీదుగా మారింది. కరోనా మహమ్మారి వంటి సరికొత్త వ్యాధి సంభవించింది. ఈ సందర్భంలో వైద్యం అందక అత్యధిక మరణాలు, దీర్ఘకాలిక వ్యాధి బారినపడిన పరిస్థితి తలెత్తింది. దీనిని ఎదుర్కొనే పరిస్థితి లేక ఇబ్బందిపడి, ప్రజలు తీవ్రంగా ఆర్థిక భారాలు ఎదుర్కొ న్నారు. కార్పొరేట్ వైద్యం భరించలేక పోయారు. ప్రభుత్వం అందించే వైద్యం సరి పోలేదు. వైద్య ఖర్చులు అధికం కావడంతో మధ్య తరగతి ప్రజలు సైతం పేదరికంలోకి జారుకున్నారు. ప్రజారోగ్య వైద్యం మొత్తంగా ప్రభుత్వమే నిర్వహించాలి. ప్రభుత్వ, ప్రైవేటు రంగంలోని మెడికల్ సర్వీసులన్నీ ప్రభుత్వ నియంత్రణలో ఉండాలని ఆ తీర్మానం డిమాండ్ చేసింది.

రామకృష్ణ, హరినాథరెడ్డి, నారాయణ మాటామంతి

రాష్ట్ర మహాసభలు జరిగే ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది యడ్ల కృష్ణకిశోర్, ఎం.రాజేంద్రప్రసాద్

జాతీయస్థాయి విద్య, ఉద్యోగ పరీక్షలు తెలుగులో నిర్వహించాలి

విశాలాంధ్ర బ్యూరో– విశాఖపట్నం: జాతీయస్థాయిలో విద్య, ఉద్యోగ పరీక్షలను తెలుగులోనే నిర్వహించాలని సీపీఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు గంగా సురేశ్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. తెలుగు విద్యార్థులకు విషయ పరిజ్ఞానంపై పట్టు ఉన్నప్పటికీ కేవలం భాష కారణంగా ఎంతోమంది ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు దూరమవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే ఉన్నత విద్య ప్రవేశ పరీక్షలు, ఉద్యోగ పరీక్షలు కేవలం హిందీ, ఇంగ్లీషులో ఉండటమే ఇందుకు కారణం. రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రకారం అధికారిక భాషలన్నింటిలోనూ పరీక్షలు నిర్వహించాలి. ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో భాషా వివక్ష చూపకూడదని రాజ్యాంగంలోని అధికరణ 16 చెబుతోంది. హిందీ, ఇంగ్లీష్‌లో పరీక్షలు నిర్వహించడం వల్ల హిందీ రాష్ట్రాల వారికే ఎక్కువ ప్రయోజనం చేకూరుతుంది. అందువల్ల జాతీయస్థాయి పరీక్షలను తెలుగులో నిర్వహించాలని మహాసభ డిమాండ్ చేసింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.